నవతెలంగాణ
నమ్మదగిన తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్
1
శనివారం | సెప్టెంబర్ 21, 2024 | www.navatelangana.com

కవ్వాల్ టైగర్‌జోన్‌లో నివాసముంటున్న వ్యక్తుల అరెస్టు

నవతెలంగాణ-జన్నారం

కుమురం భీం-ఆసిఫాబాద్ జిల్లా కు చెందిన కొందరు వ్యక్తులు కవ్వాల్ అభయారణ్యంలోని అటవీ ప్రాంతంలో అక్రమంగా నివాసమేర్పర్చుకున్నారని అటవీ అధికారులు వారిని అరెస్ట్ చేశారు. ఈ మేరకు ఇందన్‌పల్లి ఎఫ్ఆర్ఓ అఫీసుద్దీన్ ఒక ప్రకటన విడుదల చేశారు. అటవీ శాఖ జంతు సంరక్షణ చట్టం-1972 ప్రకారం కేసులు నమోదు చేశామన్నారు. నెల నుండి కవ్వాల్ అటవీ ప్రాంతంలో పులి సంచరిస్తోందని, ఇలాంటి సమయంలో మానవ హాని, వన్యప్రాణి హాని జరగకుండా తగు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈ క్రమంలో ఆసిఫాబాద్ జిల్లాకు చెందిన వ్యక్తులను అరెస్ట్ చేసి లక్షెట్టిపేట కోర్టులో హాజరు పర్చామని తెలిపారు.

సర్టిఫికెట్ల జారీ విషయంలో వాగ్వాదం

నవతెలంగాణ-తాండూర్

సర్టిఫికెట్ల జారీ విషయంలో మాజీ మండల అధ్యక్షులు సిరంగి శంకర్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ అంజన్ కుమార్ మధ్య శుక్రవారం తీవ్ర వాగ్వివాదం జరిగింది. ఒకరినొకరు దూషించుకోవడంతో పాటు ఘర్షణ పడే వాతావరణం నెలకొంది. రెవెన్యూ సిబ్బంది, స్థానిక నాయకులు ఇరువురి సముదాయించడంతో ఘర్షణ సద్దుమణిగింది. సర్టిఫికెట్ల జారీ విషయంలో రెవెన్యూ అధికారులు కాలయాపన చేస్తున్నారని కాంగ్రెస్ నాయకులు శంకర్ ఆరోపించారు. విచారణ పేరుతో రోజుల తరబడి ఆఫీసు చుట్టూ తిప్పుకుంటూ సర్టిఫికెట్ల జారీలో తాత్సారం చేస్తున్నారని పేర్కొన్నారు. వారం రోజులుగా మీ సేవ పోర్టల్ సిగ్నల్ లేకపోవడంతో సర్టిఫికెట్ల జారీ కొంత మేరకు ఆలస్యం జరిగిందని రెవెన్యూ అధికారులు తెలిపారు. రెవెన్యూ శాఖ నిర్ధారించిన గడువులోగా దరఖాస్తుదారులందరికీ సర్టిఫికెట్లు అందజేస్తామని పేర్కొన్నారు. దరఖాస్తుదారులు అధికారులను నేరుగా సంప్రదించాలని, మధ్యవర్తుల ద్వారా ధ్రువపత్రాలను పొందేందుకు ప్రయత్నించరాదని అధికారులు తెలిపారు.

నోటీసుల భయం..!

- సిమెంట్ ఫ్యాక్టరీకి భూములిచ్చేందుకు విముఖత
- మరోసారి నోటీసుల జారీతో అన్నదాతల్లో ఆందోళన
- తక్కువ ధరతో తీవ్రంగా నష్టపోతామని ఆవేదన
- కలెక్టరేట్‌కు పరుగులు..అధికారులకు మొర

ఫ్యాక్టరీ నిర్మాణం కోసం భూములు ఇవ్వాలని అధికారులు జారీ చేసిన నోటీసులు అన్నదాతల్లో మళ్లీ ఆందోళన రేపుతోంది. తమ జీవనోపాధికి మార్గంగా ఉన్న భూములను అప్పగించేదిలేదని ఖరాఖండిగా చెబుతున్నా..అధికార యంత్రాంగం మరోసారి నోటీసులు జారీ చేయడం వారిలో మరింత ఆందోళనకు కారణమవుతోంది. ప్రభుత్వం నిర్ణయించిన మార్కెట్ ధరకు భూములు అప్పగిస్తే తాము తీవ్రంగా నష్టపోతామని..వారు ఇచ్చే పరిహారంతో ఇతర ప్రాంతాల్లో ఎకరం భూమి కూడా కొనలేని పరిస్థితి ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఏటా రెండు పంటలతో సస్యశ్యామలంగా ఉండే భూములను ఫ్యాక్టరీ నిర్మాణం కోసం అప్పగిస్తే తమ బతుకుల పరిస్థితి ఏంటని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇది వరకే నోటీసులు జారీ కాగా రైతులు ఉన్నతాధికారుల వద్దకు వెళ్లి తాము భూములిచ్చేది లేదని స్పష్టం చేశారు. తాజాగా రెవెన్యూ అధికారులు రెండోసారి నోటీసులు జారీ చేయడం వారిలో ఆందోళన రేకెత్తించడానికి కారణమవుతోంది.


ఇటీవల కలెక్టరేట్ ఎదుట రైతుల ఆందోళన

నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

ఆదిలాబాద్ జిల్లా కేంద్రానికి సమీపంలో నూతనంగా నిర్మించేందుకు సిద్ధమైన రేణుక సిమెంట్ ఫ్యాక్టరీకి భూములు ఇచ్చేందుకు రైతులు విముఖత కనబరుస్తున్నారు. ఈ పరిశ్రమ నిర్మాణం కోసం 2017లో భూసేకరణ చేపట్టిన అధికారులు 107 ఎకరాలు సేకరించారు. రైతుల నుంచి తీసుకున్న భూముల్లో పరిశ్రమకు సంబంధించి బోర్డు పెట్టి వదిలేశారు. దీంతో ఈ పరిశ్రమను ఇచ్చిన భూములు తిరిగి ఇచ్చేయాలని రైతులు ఆందోళన కూడా చేపట్టిన సందర్భాలున్నాయి. తాజాగా మళ్లీ ఈ పరిశ్రమను స్థాపించేందుకు ఆ కంపెనీ యాజమాన్యం ముందుకు రావడంతో రైతుల నుంచి భూసేకరణ ప్రక్రియ చేపట్టాలని భావించింది. తాజాగా సమీపంలో మరో 460 ఎకరాల భూమి ఉండటంతో అదనంగా సేకరించేందుకు సిద్ధమైంది. అధికారులు సంబంధిత రైతులకు నోటీసులు జారీ చేయడంతో మిగితా రైతుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. ఎకరాకు రూ.8.25లక్షల చొప్పున చెల్లిస్తామని కొందరు రైతుల నుంచి సంతకాలు తీసుకోవడంతో మిగితా రైతుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. అతి తక్కువ ధరకు భూములు తీసుకోవడంతో మిగితా రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తక్కువ ధరకు భూములిచ్చేది లేదని ఖరాఖండిగా తేల్చిచెబుతుండటం చర్చనీయాంశంగా మారింది.

నోటీసుల జారీతో ఆందోళన..!

రేణుక సిమెంట్ ఫ్యాక్టరీ నిర్మాణం కోసం అధికారులు భూసేకరణ ప్రక్రియ చేపడుతున్నారు. ఇది వరకే సేకరించిన 107 ఎకరాలకు తోడు మరికొన్ని ఎకరాలు సేకరించాలని భావిస్తున్నారు. ఇది వరకు సేకరించిన భూములకు సమీపంలోనే సర్వే నెం.27, 30, 82, 83ల్లో యాపల్‌గూడ, కొత్తగూడ, రామాయి, యశ్వంత్‌గూడకు చెందిన రైతులకు చెందిన సుమారు 460 ఎకరాల భూమి ఉంది. 2017లో రైతులకు ఎకరానికి రూ.9.25లక్షలు చెల్లించి సేకరించగా.. తాజాగా ఎకరానికి రూ.8.25లక్షలు మాత్రమే ఇస్తామని చెబుతుండటం రైతుల్లో మరింత ఆందోళనకు కారణమవుతోంది. ప్రభుత్వం నిర్ణయించిన మార్కెట్ ధర ప్రకారం మూడు రేట్లు పెంచి ఇస్తామని చెబుతుండగా.. వాస్తవానికి ప్రభుత్వ ధర ప్రకారం ఎవరూ భూములు విక్రయించరని.. ప్రయివేటు మార్కెట్‌లో ఉండే ధరనే అందరూ అనుసరిస్తారని రైతులు చెబుతున్నారు. ప్రభుత్వ ధరతో తాము తీవ్రంగా నష్టపోతామని.. ఈ భూమిని నమ్ముకొని జీవనం సాగించే తమకు అన్యాయం చేయకూడదని రైతులు వాపోతున్నారు. ప్రస్తుతం ప్రయివేటు మార్కెట్ ప్రకారం ఆ చుట్టు పక్కల భూములు ఎకరానికి రూ.40 నుంచి రూ.50లక్షల వరకు పలుకుతోంది. కానీ అధికారులు మాత్రం ఎకరానికి రూ.8.25లక్షలు మాత్రమే చెల్లిస్తామని చెబుతుండటంతో రైతుల ఆందోళనకు కారణమవుతోంది.



భూమిని కోల్పోతే తీవ్రంగా నష్టపోతాం : స్వామి, రైతు, యాపల్‌గూడ

ఆ భూమే మా జీవనాధారం. ఏటా రెండు పంటలు పండిస్తూ బతుకుతున్నాం. ఫ్యాక్టరీ నిర్మాణం కోసం ప్రభుత్వ ధరకు భూమిని అప్పగిస్తే తాము తీవ్రంగా నష్టపోతాం. ప్రస్తుతం వారు చెల్లించే ధరతో ఇతర చోట కూడా భూమిని కొనుగోలు చేయలేని పరిస్థితి ఉంటుంది. అధికారులు నోటీసులు జారీ చేస్తుండటంతో ఆందోళన చెందుతున్నాం. మాకు సమ్మతమైన ధర చెల్లిస్తేనే భూమిని అప్పగించేందుకు సిద్ధమవుతాం. లేదంటే భూమిని ఇచ్చే ప్రసక్తే లేదు.

నిబంధనల ప్రకారమే నోటీసులు జారీ : వినోద్‌కుమార్, ఆర్డీఓ, ఆదిలాబాద్

భూసేకరణ చట్టం ప్రకారమే రైతులకు నోటీసులు జారీ చేస్తున్నాం. సంబంధితశాఖలు ఇచ్చిన సర్వే నెంబర్ల ప్రకారం అక్కడ ఉన్న రైతుల వివరాలు తెలుసుకోవడంతో పాటు వారి అభిప్రాయాలు సేకరిస్తున్నాం. వారు అంగీకరిస్తేనే సంతకాలు తీసుకుంటాం. రైతులు వెల్లడించిన అభిప్రాయాలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం. ప్రభుత్వ నిబంధనల ప్రకారం పారదర్శకంగా వ్యవహరిస్తున్నాం.

పిడుగు పడి మహిళ మృతి

నవతెలంగాణ-తాండూర్



మండలంలోని అచలాపూర్ గ్రామానికి చెందిన గోలెం పోసక్క(55) శుక్రవారం పిడుగుపాటుతో మృతి చెందింది. శుక్రవారం వరి పొలంలో కలుపు పనులు చేసుకుని తిరిగి వస్తుండగా సాయంత్రం 4 గంటల సమయంలో వర్షంతో పాటు పిడుగు పడింది. దీంతో ఆమె మృతి చెందిందని స్థానికులు తెలిపారు.

పోలీస్ అధికారులు, సిబ్బందికి ప్రశంసా పత్రాల అందజేత



నవతెలంగాణ-నిర్మల్

వారం రోజులుగా కంటి మీద కునుకు లేకుండా గణేష్ బందోబస్తులో పాల్గొన్న జిల్లా పోలీసు అధికారులకు, సిబ్బందికి శుక్రవారం ఎస్పీ డాక్టర్ జానకి షర్మిల ప్రశంసా పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. భైంసా, ముధోల్, నిర్మల్ పట్టణం, ఖానాపూర్ ప్రాంతాలలో పకడ్బందీగా విధులు నిర్వర్తించిన 128 మందికి ప్రశంసా పత్రాలను అందజేశామన్నారు. గణేష్ నవరాత్రి ఉత్సవాలను జిల్లాలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పూర్తి చేశామని తెలిపారు. గడిచిన 12 రోజులుగా జిల్లా వ్యాప్తంగా పోలీస్ అధికారులు, క్షేత్రస్థాయిలో పనిచేసే సిబ్బంది కృషి వల్లనే గణేష్ ఉత్సవాలను విజయవంతంగా నిర్వహించుకున్నామని తెలిపారు. దీనికి అధికారులను, సిబ్బందిని అభినందించారు. భైంసా ఏఎస్పి అవినాష్ కుమార్ మాట్లాడుతూ అన్ని వర్గాల వారు సహకరించి నిమజ్జనం పూర్తికి సహకరించారని ఆనందం వ్యక్తం చేశారు. గతంలో భైంసాలో జరిగిన సంఘటనలు చూసి అందరూ భయపడ్డారని, దానికి విరుద్ధంగా ఈ సారి బందోబస్తు జరగటం హర్షించదగ్గ విషయమని తెలిపారు. కార్యక్రమంలో డీఎస్పీ గంగారెడ్డి, ఇన్‌స్పెక్టర్‌లు, ఆర్ఐలు, ఆర్ఎస్ఐలు, బ్లూకోల్ట్, పెట్రోకార్, ఐటీ, స్పెషల్ బ్రాంచ్ సిబ్బంది పాల్గొన్నారు.

జ్వరంతో మహిళ మృతి

నవతెలంగాణ-మంచిర్యాల



కుమురం భీం-ఆసిఫాబాద్ జిల్లా తిర్యాణి మండలం సుంగాపూర్ గ్రామానికి చెందిన దుర్గం రాజ్యలక్ష్మి(21) జ్వరంతో మృతి చెందింది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం..రాజ్యలక్ష్మికి మూడు రోజుల క్రితం జ్వరం రావడంతో స్థానికంగా ఆర్ఎంపీతో ఇంజక్షన్ చేయించారు. అదే రోజు రాత్రి ట్రాన్సిస్ రావడంతో సొంతంగా చికిత్స చేసుకుంది. గురువారం రాత్రి విపరీతంగా జ్వరం వచ్చి నొప్పులు పెరగడంతో శుక్రవారం ఉదయం స్వగ్రామం నుండి మంచిర్యాల జిల్లా ప్రభుత్వ జనరల్ ఆసుపత్రికి ఆటోలో తీసుకొచ్చారు. రాజ్యలక్ష్మిని పరీక్షించిన ప్రభుత్వ ఆసుపత్రి వైద్యులు మార్గ మధ్యలో మృతి చెందినట్లు వెల్లడించారు. మృతురాలికి ఇద్దరు కుమారులు సాత్విక్(3), శ్రీహాస్(10 నెలలు) ఉన్నారు. భర్త నుండి రెండేండ్లుగా దూరంగా ఉంటోంది.

ఆర్‌టీసీ రాయితీ పథకాలపై అవగాహన



నవతెలంగాణ-తాంసి

మండలంలోని కప్పర్ల గ్రామంలో శుక్రవారం ఆర్‌టీసీ అందిస్తున్న రాయితీ పథకాల గురించి ప్రజలకు అవగాహన కల్పించారు. గమ్యం యాప్ డౌన్‌లోడ్ చేసుకొని బస్సు ఎక్కడికి వచ్చిందో పూర్తి వివరాలు తెలుసుకోవచ్చని తెలియజేశారు. రోడ్డు భద్రతా నియమాలను పాటిస్తూ సురక్షితమైన ప్రయాణం కోసం ఆర్‌టీసీ బస్సుల్లో ప్రయాణించాలని కోరారు. ప్రజలకు, వికలాంగులకు పాసులు అందజేశారు. కార్యక్రమంలో వీటీఓ ఎం.శ్రీనివాస్, కండక్టర్ ఎం.మధుకర్, వీడీసీ అధ్యక్షులు వి.సంతోష్ గ్రామస్తులు పాల్గొన్నారు.

అనారోగ్యంతో మహిళ ఆత్మహత్య

నవతెలంగాణ-తలమడుగు

ఝరి గ్రామానికి చెందిన బూరుగు సుజాత(36) అనారోగ్యంతో బాధపడుతూ గ్రామ సమీపంలో గల వ్యవసాయ బావిలో దూకి ఆత్మహత్యకు పాల్పడింది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం..సుజాత కొన్ని సంవత్సరాల నుండి నాలుక క్యాన్సర్‌తో బాధపడుతోంది. ఆపరేషన్ చేసుకున్నప్పటికీ నయం కాలేదు. దీంతో పాటు అత్త వేధించడంతో ఆత్మహత్యకు పాల్పడింది. తండ్రి విఠల్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మున్సిపల్ కార్మికుల పెండింగ్ వేతనాలు చెల్లించాలి

- సీఐటీయూ రాష్ట్ర నాయకులు దర్శనాల మల్లేష్
- మున్సిపల్ కార్యాలయం ఎదుట కార్మికుల నిరసన



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

మున్సిపల్ కార్మికుల పెండింగ్ వేతనాలను వెంటనే చెల్లించి ఇబ్బందులను దూరం చేయాలని సీఐటీయూ రాష్ట్ర నాయకులు దర్శనాల మల్లేష్ డిమాండ్ చేశారు. శుక్రవారం కార్మికుల సమస్యలు పరిష్కరించాలని మున్సిపల్ కార్యాలయం ఎదుట తెలంగాణ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్(సీఐటీయూ) ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. అధికారుల తీరుకు నిరసనగా నినాదాలు చేశారు. అనంతరం అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మల్లేష్ మాట్లాడుతూ కొన్ని నెలలుగా అధికారులు నిధుల కొరత చూపిస్తూ కార్మికులకు వేతనాలు ఇవ్వడం లేదని మండిపడ్డారు. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు పనికి తగ్గ వేతనం ఇచ్చి ప్రతి కార్మికుడికి వారాంతపు సెలవులు ఇవ్వాలని కోరారు. కార్మిక చట్టాలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తుంగలో తొక్కి శ్రమ దోపిడీకి పాల్పడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. మున్సిపల్ కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్, వివిధ రకాల కార్మికులను పర్మినెంట్ చేయాలని, కనీస వేతనం రూ.26వేలుగా ఇవ్వాలని డిమాండ్ చేశారు. వివిధ విభాగాల్లో పనిచేస్తున్న వారి చదువు, వృత్తి నైపుణ్యతను గుర్తించి జవాన్లుగా, డ్రైవర్లుగా, సానిటరీ ఇన్‌స్పెక్టర్లుగా, కంప్యూటర్ ఆపరేటర్లుగా ప్రమోషన్స్ కల్పించాలన్నారు. రాత్రి వేళ డ్యూటీ చేసే కార్మికులకు ట్రాన్స్‌పోర్ట్ సౌకర్యం కల్పించాలని, పని ప్రదేశాలలో రెస్ట్ రూములు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. పిఎఫ్, ఈఎస్ఐ డబ్బులు కార్మికుల ఖాతాల్లో జమ చేయాలని, జమ చేయని మున్సిపల్ బాధ్యులపై చర్యలు తీసుకోవాలని తెలిపారు. అనారోగ్యాలకు గురైన కార్మికులకు మెరుగైన ఈఎస్ఐ వైద్య సాయం అందించేందుకు ప్రతి మున్సిపాల్టీలో ఈఎస్ఐ హాస్పిటల్స్ ఏర్పాటు చేసే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. 50సంవత్సరాలు పైబడిన, అనారోగ్యానికి గురై చనిపోయిన కార్మికుల స్థానంలో కుటుంబ సభ్యులకు అవకాశం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు బొజ్జ ఆశన్న, మున్సిపల్ యూనియన్ జిల్లా కార్యదర్శి అగ్గిమల్ల స్వామి, అధ్యక్షుడు దర్శనాల నగేష్, మున్సిపల్ డ్రైవర్స్ యూనియన్ అధ్యక్షుడు జనార్దన్, ఆజిమ్, ఆత్మరాం, శ్యామ్, ఊశన్న పాల్గొన్నారు.

ఆరోగ్య మిత్రలకు కనీస వేతనం ఇవ్వాలి



నవతెలంగాణ-నస్పూర్

ఆరోగ్య మిత్రులకు కనీస వేతనం ఇవ్వాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని యునైటెడ్ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్(సీఐటీయూ)గౌరవ అధ్యక్షుడు దుంపల రంజిత్ కుమార్ డిమాండ్ చేశారు. శుక్రవారం ఆరోగ్య మిత్రులకు డేటా ప్రాసెసింగ్ ఆఫీసర్ క్యాడర్ హోదా ఇవ్వాలని కోరుతూ కలెక్టర్ కుమార్ దీపక్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రంజిత్ కుమార్ మాట్లాడుతూ రాజీవ్ ఆరోగ్యశ్రీ, హెల్త్ కేర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో పనిచేస్తున్న ఆరోగ్యమిత్రల సమస్యలు పరిష్కరించాలని ఎంతో కాలంగా ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసినా నేటి వరకు ఏ ఒక్క సమస్య పరిష్కారం కాలేదన్నారు. ఆరోగ్యమిత్రలను డేటా ప్రాసెసింగ్ ఆఫీసర్ కేడర్‌గా మార్చి జీఓ నెం.60 ప్రకారం రూ.22,750 వేతనం చెల్లించాలని డిమాండ్ చేశారు. జీతభత్యాలు అవుట్ సోర్సింగ్ ఏజెన్సీల ద్వారా కాకుండా నేరుగా ట్రస్ట్ ద్వారా చెల్లించాలని, కాంట్రాక్ట్ విధానంలోకి మార్చాలని, రాబోయే పిఆర్‌సిలో కనీస వేతనం రూ.35,000తో పాటు టిఎ, డిఎ సౌకర్యం కల్పించాలని కోరారు. కార్యక్రమంలో ఆరోగ్యశ్రీ, ఆరోగ్య మిత్ర యూనియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పారిపెల్లి మల్లేష్, నానయ్య, ఉపాధ్యక్షులు అనిత, సరిత, సహాయ కార్యదర్శులు రవీందర్, వెంకటేష్, వసంత, సదానందం, జయసుధ, సౌందర్య కవిత, లత, భాగ్యలక్ష్మి రాణి, రాజేశ్వరి, శారద పాల్గొన్నారు.

బాలశక్తి కార్యక్రమాన్ని పకడ్బందీగా అమలు చేయాలి

- నిర్మల్ కలెక్టర్ అభిలాష అభినవ్
- స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్‌తో కలిసి పథకం ప్రారంభం



నవతెలంగాణ-నిర్మల్

బాలశక్తి కార్యక్రమాన్ని పకడ్బందీగా అమలు చేయాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని కస్బా మైనార్టీ రెసిడెన్షియల్ పాఠశాలలో ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన బాలశక్తి కార్యక్రమాన్ని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్‌తో కలిసి ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు ఆర్థిక అక్షరాస్యత, ఆరోగ్య, నైపుణ్య అభివృద్ధికి బాలశక్తి కార్యక్రమం ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో భాగంగా జిల్లాలోని 52 ప్రభుత్వ రెసిడెన్షియల్ పాఠశాలలలో చదువుతున్న 6 నుండి 12 తరగతుల విద్యార్థులకు ఆరోగ్యం, ఆర్థిక అక్షరాస్యత, క్షేత్ర పర్యటన అనుభవాలు, నైపుణ్య అభివృద్ధి, సాధికారత వంటి అంశాలపై అవగాహన కల్పించడం బాలశక్తి కార్యక్రమం ముఖ్య ఉద్దేశం అని తెలిపారు. విద్యార్థులకు వివిధ విభాగాలలో నైపుణ్యాలను, నిత్యజీవితంలోని రోజువారి కార్యక్రమాల పట్ల అవగాహన కల్పించేందుకు ఈ కార్యక్రమాన్ని ప్రారంభించామని తెలిపారు. ఈ సేవల పట్ల విద్యార్థులకు అవగాహన కల్పించాలని సూచించారు. పాఠశాలల్లో వైద్య శిబిరాలు ఏర్పాటు చేయడం విద్యార్థుల హెల్త్ ప్రొఫైల్ తయారుచేసి, వ్యక్తిగత పరిశుభ్రత, ఆరోగ్యం, పౌష్టికాహారం, వ్యాధులు, ఒత్తిడిని జయించడం, స్వీయ రక్షణ వంటి అంశాలపై విస్తృత అవగాహన కల్పించాలని తెలిపారు. పాఠశాలల పూర్వ విద్యార్థులు, తల్లిదండ్రులు, గ్రామీణ మండల స్థాయి అధికారులు, ఎన్జీవోలు, ఆశా కార్యకర్తలు, మహిళా స్వయం సంఘాలను భాగస్వామ్యం చేయాలని తెలిపారు. అదనపు కలెక్టర్ మాట్లాడుతూ బాలశక్తి కార్యక్రమం రాష్ట్రంలోనే మొదటగా నిర్మల్ జిల్లాలో ప్రారంభించుకోవడం జరిగిందని తెలిపారు. విద్యార్థులకు ఆరోగ్యం, ఆర్థిక అక్షరాస్యత, బ్యాంకు సేవల నిర్వహణ, స్కిల్ డెవలప్మెంట్ ఇతర అంశాలపై అవగాహన కల్పించాలని సూచించారు. నైపుణ్యాలను మెరుగుపరుచుకుంటూ విద్యార్థులు జీవితంలో ఉన్నత స్థానాల్లో నిలవాలని కోరారు. వివిధ అంశాలలో విద్యార్థుల సందేహాలను నివృత్తి చేశారు. అనంతరం దిలావర్‌పూర్ కేజీబీవీలో బాలశక్తి ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా నిర్వహించిన వ్యాసరచన, పెయింటింగ్ పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు కలెక్టర్ బహుమతులను అందజేశారు. కార్యక్రమాలలో డిఈఓ రవీందర్‌రెడ్డి, డిఎంఅండ్‌హెచ్ఓ డాక్టర్ రాజేందర్, లీడ్ బ్యాంకు మేనేజర్ రాంగోపాల్, తహసీల్దార్ స్వాతి, ఎంఈఓ శంకర్, ఉపాధ్యాయులు, అధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు.

భూమిని కబ్జా చేసిన వ్యక్తి అరెస్ట్



నవతెలంగాణ-లక్షెట్టిపేట

సంతకాలు ఫోర్జరి చేసి భూమిని కబ్జా చేసిన వ్యక్తిని పోలీసులు అరెస్ట్ చేశారు. శుక్రవారం సిఐ కార్యాలయంలో ఏసీపీ ఆర్.ప్రకాష్ వివరాలు వెల్లడించారు. దండేపల్లి మండలం మేదరిపేట గ్రామానికి చెందిన రామడుగు లక్ష్మణ్‌రావు పట్వారీగా పనిచేసి ఉద్యోగ విరమణ పొందాడు. ఫిర్యాదుదారుడు రామడుగు మురళీధర్‌రావుకు వారి పూర్వీకుల నుండి అల్లిపూర్ గ్రామ శివారులో సర్వే నెం.88లో ఎకరం 33 గుంటల భూమి వచ్చింది. 2006లో ఫిర్యాదుదారుడి తండ్రి మృతి చెందాడు. 1998లో నిందితుడు లింగాపూర్‌కు చెందిన అజ్మీర హరినాయక్ స్టాంప్ పేపర్‌పై గుర్తు తెలియని వ్యక్తితో వేలిముద్ర వేయించి నకిలీ సాదాబైనామా సృష్టించి భూమిని అమ్మాడు. రామడుగు లక్ష్మణ్‌రావు పట్వారి పనిచేయడం వల్ల సంతకం చేస్తాడు. కానీ సాదాబైనామాలో వేలు ముద్రలు ఉన్నాయి. విషయం తెలిసి రెండు నెలల క్రితం మురళీధర్‌రావు అజ్మీర్ నాయక్‌ను అడిగాడు. మీకు భూమి లేదు. ఏమీ లేదు మరోసారి అడిగితే చంపేస్తానని, ఎస్సీ, ఎస్టీ కేసు పెట్టిస్తానని బెదిరించాడు. సంతకాలు ఫోర్జరీ చేసి అక్రమంగా భూమిని కబ్జా చేసిన వ్యక్తిని శుక్రవారం అదుపులోకి తీసుకొని కోర్టులో హాజరుపర్చి రిమాండ్‌కు తరలించారు. నిందితునిపై మరికొన్ని నేరపూరిత ఆరోపణలు ఉన్నాయనని, వాటిని కూడా పరిశీలిస్తామని ఏసీపీ తెలిపారు. చాకచక్యంగా వ్యవహరించి కేసును ఛేదించిన సిఐ, ఎస్సైతో పాటు పోలీస్ సిబ్బందిని ఏసీపీ అభినందించారు. విలేకరుల సమావేశంలో సీఐ అల్లం నరేందర్, దండేపల్లి ఎస్సై ఉదయ్ కిరణ్ ఉన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

నవతెలంగాణ-సిరికొండ

మండల కేంద్రానికి చెందిన కంచం మల్లారెడ్డి ఇటీవల అనారోగ్యంతో బాధపడుతూ



మరణించాడు. దీంతో బాధిత కుటుంబాన్ని శుక్రవారం కాంగ్రెస్ బోథ్ నియోజకవర్గ ఇన్‌చార్జీ ఆడే గజేందర్ పరామర్శించారు. మృతి గల కారణాలు అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట కాంగ్రెస్ మండలాధ్యక్షుడు ఇమామ్, నాయకులు రంజాన్, మల్లేష్, సాజిద్, దత్తు, మాధవ్ పటేల్ పాల్గొన్నారు.

నవతెలంగాణ

సమగ్ర తెలుగు దినపత్రిక

ఆదిలాబాద్-నిర్మల్

2

శనివారం | సెప్టెంబర్ 21, 2024 | www.navatelangana.com

పరిసరాల పరిశుభ్రతను పాటించాలి

నవతెలంగాణ-ముధోల్

పరిసరాల పరిశుభ్రతను పాటించాలని పంచాయతీ కార్యదర్శి నాగుల భాస్కర్‌గౌడ్ అన్నారు. శుక్రవారం మండలంలోని తరోడ గ్రామంలో గ్రామసంఘం ఆధ్వర్యంలో డ్రైడే కార్యక్రమాన్ని నిర్వహించారు. పేరుకపోయిన చేత్తను తొలగించాలని సూచించారు. వ్యర్థ నీరు నిలువ ఉంచరాదన్నారు. ఇంటితో పాటు పరిసర ప్రాంతాలను శుభ్రంగా ఉంచుకోవాలని అన్నారు. ఇంటి ముందర మురికి నీరు తొలగించాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సంఘం అధ్యక్షులు భూషి రాధ, అంగన్‌వాడీ కార్యకర్త అర్షియా తబస్సుమ్, ఆశవర్కర్ ఆఫ్సరీబేగం, కారోబారి ఆలాంఖాన్, వీఓఏ ఓమేశ్వర్ పాల్గొన్నారు.



అర్హత కలిగిన ప్రతి కుటుంబానికి జాబ్‌కార్డు అందించాలి

- డీఆర్డీఓ విజయలక్ష్మి



నవతెలంగాణ-దస్తురాబాద్

మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టంలో భాగంగా మూడో విడత సామాజిక తనిఖీ ప్రజా వేదికను శుక్రవారం మండల కేంద్రంలోని రైతు వేదికలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి డీఆర్డీఓ విజయలక్ష్మి హాజరయ్యారు. 2022-23 ఆర్థిక సంవత్సరానికి 13 గ్రామాల్లో జరిగిన ఉపాధి హామీ పనులు, లోపాలను, ఐదు రోజులపాటు సామాజిక తనిఖీ చేసి, ప్రజా వేదికలో ప్రస్తావించారు. ఇందులో భాగంగా రేవోజీపేట, బుట్టాపూర్, మల్లాపూర్, గుడిసిరియాల, పెరికపల్లి, దేవునిగూడెం, ఆకొండపేట్, భూత్కూర్ గ్రామ పంచాయతీలలో జరిగిన ఉపాధి హామీ పనులలో వంద రోజులు నిండిన వ్యక్తులకు రోజు కూలి రాకపోవడం, జాబ్‌కార్డు ఇవ్వకపోవడం, కూలీల సంతకాలు తీసుకుపోవడం ఇలాంటి సమస్యలు తలెత్తాయి. కాగా రేవోజీపేట ఫారెస్ట్ నర్సరీ పనుల్లో అవకతవకలు ఉన్నాయని, తనఖీ బృందం గుర్తించారు. ఒకరి పేరు మీద ఇంకొకరు వెళ్లారని అన్నారు. ఇందులో భాగంగా ఉపాధి హామీ పనికి సంబంధించిన ఎంబి రికార్డులలో ఎంపీడీఓ, ఏపీఓ, సెక్రటరీల సంతకాలు లేవని, డీఆర్డీఓ ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. అనంతరం డీఆర్డీఓ మాట్లాడారు. అర్హత కలిగిన ప్రతి కుటుంబానికి జాబ్ కార్డును ఇవ్వాలని అన్నారు. గ్రామపంచాయతీలో సెక్రటరీ వ్యవస్థ కీలకమైనదని, ప్రతి ఒక్కరూ బాధ్యతగా పనిచేయాలని అన్నారు. సెక్రటరీల పనితీరుపై ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. భవిష్యత్తులో పనితీరును మారకుంటే, సంబంధిత ఎంపీడీఓ, ఎంపీఓ, ఏపీఓ, టీఏ, సెక్రటరీలపై చర్యలు తప్పవని ప్రజావేదికగా హెచ్చరించారు. అనంతరం మూడో సామాజిక తనిఖీల్లో భాగంగా రూ.26వేలను రికవరీ, దస్తురాబాద్‌లో విధులు నిర్వహించిన సెక్రటరీ హిందూమతి ప్రజా వేదికకు హాజరు కాకపోవడంతో రూ.2వేలు పెనాల్టీ వేసినట్లు తెలిపారు. వారి వెంట హెచ్‌ఆర్ సుధాకర్, డీవీఓ లక్ష్మయ్య ఎంపీడీఓ రమేష్, భాస్కర్‌రెడ్డి, ఎంపీఓ రమేష్ రెడ్డి, గ్రామస్తులు పాల్గొన్నారు.

రుణమాఫీపై అపోహలు వద్దు

నవతెలంగాణ-ఖానాపూర్

అర్హత ఉన్న ప్రతి రైతుకు రుణమాఫీ చేసే బాధ్యత కాంగ్రెస్ ప్రభుత్వానిదేనని తప్పుదోవ పట్టించే ప్రతిపక్షాల మాటలను నమ్మవద్దని కాంగ్రెస్ నిర్మల్ జిల్లా ఎస్టీ సెల్ చైర్మెన్ బాణావత్ గోవింద్ నాయక్ అన్నారు. శుక్రవారం స్థానికంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ గత పాలకులు పదేండ్ల కాలంలో లక్ష వరకు రైతు రుణమాఫీ కూడా చేయలేకపోయారని అన్నారు. తాము అధికారంలోకి వచ్చిన ఆరు నెలల వ్యవధిలో సుమారు రూ.18 వేల కోట్లు 22 లక్షల మంది రైతులకు ఖాతాలో వేశామని అన్నారు. అక్కడక్కడ ఇబ్బందులు ఉన్నప్పటికీ వాటిని పరిష్కరించి అర్హత ఉన్న ప్రతి ఒక్క రైతుకు న్యాయం జరిగేలా చూస్తామని అన్నారు. రుణమాఫీపై అపోహలు వద్దని ఇది ప్రజా పాలన అని ఏ మాత్రమే కొందరు రైతుల ఖాతాలో డబ్బులు జమ అవ్వలేదని బ్యాంక్ అధికారుల సహకారంతో వాటిని పరిష్కరిస్తున్నామని తొందరలో మరికొంతమందికి రుణమాఫీ అవ్వడం జరుగుతుందని ఎవరు నిరాశ చెందాల్సిన అవసరం లేదని ఆయన అన్నారు. గత పదేండ్లలో జరిగిన ఆర్థిక విధ్వంసాన్ని దాటుకొని ఇచ్చిన మాట కోసం కేవలం 6 నెలల వ్యవధిలో రూ.18 వేల కోట్లలను కడుపు కట్టుకొని సమీకరించుకొని రైతుల ఖాతాలలో జమ చేశామని అన్నారు. మరికొన్ని రోజులలో అర్హత ఉన్న ప్రతి ఒక్క రైతుకు రుణమాఫీ జరిగి తీరుతుందని అన్నారు.

కళాశాలలో ఘనంగా హిందీ భాషా దినోత్సవం



నవతెలంగాణ-నార్నూర్

మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శుక్రవారం హిందీ భాష దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ఇన్‌ఛార్జి హిందీ అధ్యాపకుడు కాంబ్లె బాలాజికి అధ్యాపక బృందం శాలువాతో సన్మానించారు. అనంతరం కళాశాల ప్రిన్సిపల్, హిందీ అధ్యాపకులు హిందీ భాష విశిష్టతపై విద్యార్థులకు తనదైన శైలిలో తమ ప్రతిభను కనబరిచాలని సూచించారు. హిందీ భాష జాతీయ సమైక్యతను చాటి చెప్పే భాష అని భారతదేశ ప్రజలను కుల, మత, లింగ భేదం లేకుండా సమైక్యపరిచే భాష అని అన్నారు. స్వాతంత్ర్య సమరంలో సమరయోధుల గొంతుకైన భాష అని వివరించారు. భారతీయ పౌరులుగా హిందీ భాష నేర్చుకోవడం మన అందరి కర్తవ్యమన్నారు. విద్యార్థులతో హిందీ భాషపై వివిధ పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో అధ్యాపక సిబ్బంది చదల నరేష్, సీనియర్ అధ్యాపకులు పి.ఉదయ్ కుమార్, కే.వెంకటరమణ, లింగంపల్లి సుజాత, దోమకొండ సుజాత, హెచ్.జ్వాలంధర్, పవార్ గజానంద్, ఆడే కృష్ణవేణి, సిహెచ్ రుక్మిణి ఉన్నారు.

పౌష్టికాహార లోపం లేకుండా చూడాలి

నవతెలంగాణ-నార్నూర్

అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు అందించే పౌష్టికాహారం లోపం లేకుండా చూడాలని సీడీపీఓ శారద అంగన్‌వాడీ టీచర్‌కు సూచించారు. శుక్రవారం మండలంలోని నాగల్‌కొండ గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేశారు. చిన్నారుల, గర్భిణీ, బాలింతల రిజిస్టర్‌ను పరిశీలించారు. పౌష్టికాహారంతో పాటు బాలామృత్తం సక్రమంగా అందించాలని కోరారు. ఆమె వెంట అంగన్‌వాడీలు శకుంతల, శాంతాబాయి ఉన్నారు.

పోలింగ్‌స్టేషన్‌ల పరిశీలన

నవతెలంగాణ-ఖానాపూర్‌టౌన్

గ్రామపంచాయతీ ముసాయిదా నేపథ్యంలో మండలంలోని పోలింగ్ స్టేషన్‌లను ఎంపీఓ చిక్యాల రత్నాకర్‌రావు శుక్రవారం పరిశీలించారు. గోసంపల్లే, పాతెల్లాపూర్, దిలావర్‌పూర్, బాబాపూర్ (కే), కొత్తపేట్ గ్రామపంచాయతీల్లో పర్యటించి, వార్డుల వారిగా స్టేషన్‌లను పరిశీలించారు. విద్యుత్, మరుగుదొడ్లు, నీటి వసతి, తదితర సౌకర్యాలు ఉన్నాయా లేదానని ఆరా తీశారు. సరైన వసతులు లేని స్టేషన్‌లలో గ్రామపంచాయతీ ఎన్నికల నాటికి ఆయా సౌకర్యాలు ఏర్పాటు చేయనున్నట్టు ఎంపీఓ తెలిపారు. ఈ కార్యక్రమంలో సదరు పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఆరోగ్య మిత్రల సమస్యలు పరిష్కరించాలి

- సీఐటీయూ జిల్లా అధ్యక్షులు బొజ్జ ఆశన్న
- సమస్యలు పరిష్కరించేంత వరకు సమ్మె కొనసాగిస్తాం



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

రాజీవ్ ఆరోగ్యశ్రీ హెల్త్ కేర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో గత 17 సంవత్సరాలుగా రాష్ట్రవ్యాప్తంగా ప్రజలకు సేవలు అందిస్తున్న ఆరోగ్య మిత్రల సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వాలు విఫలమవుతున్నాయని రాష్ట్ర ప్రభుత్వం ఆరోగ్యమిత్ర రాష్ట్ర నాయకత్వంతో వెంటనే చర్చలు జరిపి న్యాయమైన డిమాండ్లను పరిష్కరించడానికి కార్యచరణ రూపొందించాలని లేనిపక్షంలో సమస్యలు పరిష్కరించేంతవరకు సమ్మెను కొనసాగిస్తామని సీఐటీయూ జిల్లా అధ్యక్షులు బొజ్జ ఆశన్న డిమాండ్ చేశారు. ఆరోగ్య మిత్రులతో కలిసి సమస్యలను పరిష్కారం చేయాలని కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆశన్న మాట్లాడుతూ గత 17 సంవత్సరాలుగా ఆరోగ్య మిత్రులు రాష్ట్రవ్యాప్తంగా ప్రజలకు వైద్యారోగ్య సేవలు అందిస్తున్నారన్నారు. కనీస వేతనాలు ఉద్యోగ భద్రత లేక అనేక ఇబ్బందులు పడుతున్నారు. సమస్యలను పరిష్కరించాలని అనేక సందర్భాల్లో రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి అధికారుల దృష్టికి తీసుకెళ్లిన స్పందన లేదని ప్రభుత్వం సమస్యలను పరిష్కరించక ఆరోగ్య మిత్రులు సమ్మెబాట పట్టే పరిస్థితిని కల్పించిందని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇకనైనా ఆరోగ్య మిత్రుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించే దిశగా కార్యచరణ రూపొందించాలన్నారు. ఆరోగ్య మిత్రులను డేటా ప్రాసెసింగ్ ఆఫీసర్ క్యాడర్ కల్పించాలని, జీఓ నెంబర్ 60 ప్రకారం వేతనం రూ.22వేల750 ఇవ్వాలని ఆరోగ్య మిత్రుల జీవిత భత్యాలు అవుట్‌సోర్సింగ్ ఏజెన్సీల ద్వారా కాకుండా ట్రస్టు ద్వారా చెల్లించాలన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు లింగాల చిన్నన్న, ఆరోగ్య మిత్రా జిల్లా నాయకులు శ్రీనివాస్, విశ్వనాథ్, భీంరావు, అనిత, సుజాత, గంగామణి పాల్గొన్నారు.

రేణుక సిమెంట్ భూనిర్వాసితులకు న్యాయం చేయాలి

- సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు లంక రాఘవులు, సీనియర్ నాయకులు బండి దత్తాత్రి
- సేకరించిన భూమికి ఎకరానికి రూ.40లక్షలు ఇవ్వాలి

నవతెలంగాణ-ఆదిలాబాద్ రూరల్

రేణుక సిమెంట్ ఫ్యాక్టరీ నిర్మాణం కోసం భూములు సేకరిస్తున్న అధికారులు భూనిర్వాసితులైన రైతులకు మార్కెట్ ధర ప్రకారం ఎకరానికి రూ.40లక్షలు ఇవ్వాలని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు లంక రాఘవులు, సీనియర్ నాయకులు బండి దత్తాత్రి అన్నారు. శుక్రవారం ఆదిలాబాద్ రూరల్ మండలం యాపల్‌గూడ గ్రామంలో నిర్వహించిన శాఖ మహా సభలకు ముఖ్య అతిథిగా హజరయ్యారు. కుమురంభీం విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం సీనియర్ నాయకులు బండి దత్తాత్రి పార్టీ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. రేణుక సిమెంట్ ఫ్యాక్టరీ నిర్వాసితులకు న్యాయం చేసేవరకు రాజీలేని పోరాటాలు చేస్తామని స్పష్టం చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆవలంబిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలపై గ్రామ



సమస్యల పరిష్కారానికి మహాసభల్లో చర్చించారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు అన్నమొల్ల కిరణ్, నాయకులు నేళ్ల స్వామి కె.ఆశన్న, డి.స్వామి, ఎం.గంగారెడ్డి, బి.సంతోష్ పాల్గొన్నారు.

పేదల సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయం

- ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్



నవతెలంగాణ-ఉట్నూర్

పేదల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ పేర్కొన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో లబ్ధిదారులకు కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పేదింటి ఆడపడుచులకు కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకం వల్ల ఆర్థిక భారం తగ్గుతుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పేదల సంక్షేమం కోసం ప్రతిష్టాత్మకమైన పథకాలను అమలు చేస్తోందన్నారు. మహిళల కోసం ఉచిత బస్సు ప్రయాణం, రూ.500లకే గ్యాస్ అందజేస్తున్నామని తెలిపారు. త్వరలో రూ.లక్షతో పాటు తులం బంగారం అందజేస్తామని అన్నారు. ఇండ్లు లేని పేదలను గుర్తించి వారికి ఇందిరమ్మ ఇండ్లను ఇస్తామని ప్రకటించారు. ఈ కార్యక్రమంలో అధికారులు, కాంగ్రెస్ నాయకులు ఉన్నారు.

ఇంద్రవెల్లి : పేదింటి ఆడపడుచులకు కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకం వరమని, పేదల సంక్షేమమే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో 73మంది లబ్ధిదారులకు కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పేద మధ్యతరగతి వర్గాల ప్రజల అభివృద్ధికి కృషి చేస్తోందన్నారు. కాంగ్రెస్ ఇచ్చిన మాటను నిలబెట్టుకుంటుందన్నారు. త్వరలో రూ.లక్షతో పాటు తులం బంగారం అందజేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ కే.భాస్కర్, తహసీల్దార్ ఎం.ప్రవీణ్, నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా విశ్వకర్మ తొలి వార్షికోత్సవం

నవతెలంగాణ-ఉట్నూర్

కుల వృత్తులు, చేతి వృత్తులు వారికి వరం, స్వయం ఉపాధికి భరోసా ప్రధాన మంత్రి విశ్వకర్మ యోజన పథకం అని దానిని సద్వినియోగం చేసుకోవాలని ఎంపీ గోడం నగేష్ అన్నారు. శుక్రవారం ఉట్నూర్ కేబీ కాంప్లెక్స్‌లోని పీఎమ్మార్సీ సమావేశ భవనంలో పీఎం విశ్వకర్మ తొలి వార్షికోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. సెప్టెంబర్ 2వ నుంచి 10వ తేదీ వరకు మొదటి విడత శిక్షణ పొందిన వృత్తి కళాకారులు 21 మందికి ఎంపీ గోడం నగేష్, ఎమ్మెల్యేలు వెడ్మ బొజ్జు పటేల్, పాయల శంకర్‌ల చేతుల మీదుగా సర్టిఫికెట్స్ అందజేశారు. ఎమ్మెల్యేలు వెడ్మ బొజ్జు పటేల్, పాయల శంకర్‌లు మాట్లాడుతూ గత సంవత్సరం సెప్టెంబర్ 17 న విశ్వకర్మ జయంతిని పురస్కరించుకొని ఈ పథకాన్ని ప్రారంభించడం జరిగిందని అన్నారు. 18 రకాల సంప్రదాయ చేతి వృత్తులు వారు ఈ పథకానికి అర్హులని అన్నారు. చేతి వృత్తి కళాకారుల ఉత్పత్తుల నాణ్యతను పెంచి, వారిని దేశీయ, గ్లోబల్ మార్కెట్‌తో అనుసంధానం చేయడం



ఈ పథకం ముఖ్య ఉద్దేశమని అన్నారు. ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకొని తమ వృత్తి నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలని, తద్వారా ఆర్థికంగా అభివృద్ధిని సాధించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆదిలాబాద్, జిల్లా కలెక్టర్ రాజర్షిషా, జాయింట్ డైరెక్టర్ విద్యానంద్, రీజినల్ డిప్యూటీ డైరెక్టర్ సీతారాములు, ఉట్నూర్ ఐటీఐ ప్రిన్సిపల్ రొడ్డ శ్రీనివాస్ పాల్గొన్నారు.

జీవనోపాధి.. వలస బతుకులు..



నవతెలంగాణ-ఇంద్రవెల్లి

ఉత్తర భారతంలోని రాజస్థాన్‌కు చెందిన గొర్రెల కాపరులు జిల్లాలోని నలుమూలల అటవీ ప్రాంతంలో సంచారం జీవనం కొనసాగిస్తారు. వీరి ప్రధాన వృత్తి గొర్రెలు, మేకల పోషణతో తమ జీవ నోపాధిని కొనసాగిస్తుంటారు. ప్రతి యేటా జూన్, జూలై మాసంలో ఖరీఫ్ సీజన్ రాగానే వీరు రాజస్థాన్ నుంచి జిల్లాలోని అటవీ ప్రాంతంలో గొర్రెలు, కుటుంబ సమేతంగా రావడం పరిపాటి. దానిలో భాగంగానే ఉట్నూర్ మండలంలోని అటవీ ప్రాంతంలో గొర్రెల పోషణకు వచ్చారు. ఐతే ఆ అటవీ ప్రాంతాన్ని టైగర్ జోన్ పరిధిలో ఉండటంతో అటవీశాఖ అధికారులు అటువైపు వెళ్లకుండా నిషేధం విధించారు. దీంతో వలస కుటుంబాలు గొర్రెలు, ఒంటెలు, కుటుంబ సమేతంగా మహారాష్ట్ర లోని కిన్వట్ తాలూకా వైపు వెళుతున్న దృశ్యమిది.

విద్యార్థులకు నోట్ బుక్స్ పంపిణీ



నవతెలంగాణ-ఆదిలాబాద్ రూరల్

స్మైల్ సొసైటీ ప్రతినిధి గుర్నూరె రామకృష్ణ జన్మదినం సందర్భంగా ఆదిలాబాద్ పట్టణంలోని దుర్గానగర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో నోట్‌బుక్స్, పెన్నులు, పలకలు ఇతర సామాగ్రి పంపిణీ చేశారు. మున్ముందు మరెన్నో చేపట్టడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో స్మైల్ సొసైటీ ప్రతినిధులు కేమ శ్రీకాంత్, భూరె సురేష్, మహేందర్ యాదవ్, రాహుల్, నసీర్ పాల్గొన్నారు.

'మన వంట అంగన్‌వాడీ ఇంట'



నవతెలంగాణ-ముధోల్

మండలంలోని తరోడ గ్రామ సంఘం ఆధ్వర్యంలో పోషక పాత్ర మన వంట అంగన్‌వాడీ ఇంట అనే కార్యక్రమం నిర్వహించారు. మహిళ సంఘం సభ్యులు రాగి జావా, పోషక పదార్థాలను పిల్లలకు తినిపించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి నాగుల భాస్కర్‌గౌడ్, గ్రామ సంఘం అధ్యక్షులు భూషి రాధ, అంగన్‌వాడీ టీచర్ అర్షియా తబస్సుమ్, ఆశ కార్యకర్త ఆఫ్సరీ బేగం, వీఓఏ ఓమేశ్వర్, మహిళా సంఘ సభ్యులు పాల్గొన్నారు.

నేడు రాష్ట్ర వ్యాప్త బంద్ పాటించాలి



నవతెలంగాణ-కడెం

జైనూర్ ఆదివాసీ మహిళపై జరిగిన లైంగికదాడికి నిరసనగా శనివారం రాష్ట్ర వ్యాప్తంగా బంద్ పాటించాలని ఆదివాసీ జేఏసీ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా వైస్ చైర్మెన్ ఆత్రం రవీందర్, మహిళా నాయకురాలు పెందూర్ ప్రియాంక డిమాండ్ చేశారు. శుక్రవారం సాయంత్రం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆదివాసీ నాయకులతో కలిసి వారు మాట్లాడారు. జైనూర్ గిరిజన మహిళ పట్ల జరిగిన లైంగికదాడికి రాష్ట్ర వ్యాప్తంగా అన్ని పార్టీలు మద్దతు తెలిపాలని కోరారు. అలాగే ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా సంబంధిత నిందితున్ని నడిరోడ్డు మీద ఉరితీయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం తక్షణమే బాధిత మహిళకు రూ.50లక్షలు ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని, ఆమె కొడుక్కు ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఏజెన్సీ చట్టాలను పకడ్బందీగా అమలు చేయాలని, ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఆదివాసీ నాయకులు చందు, అనుష, విజయ, భీమ్ భాయి, చిన్ను పటేల్ పాల్గొన్నారు.

రేపు తెలంగాణ ఉద్యమకారుల ఆత్మీయ సమ్మేళనం

నవతెలంగాణ-నిర్మల్

తెలంగాణ ఉద్యమకారుల ఆత్మీయ సమ్మేళనం ఈనెల 22న సాయంత్రం 4 గంటలకు జిల్లా కేంద్రంలోని పెన్షనర్ల భవనంలో ఉంటుందని తెలంగాణ విద్యావంతుల వేదిక రాష్ట్ర కార్యదర్శి ఆరెపల్లి విజయ్ కుమార్ శుక్రవారం ఓ ప్రకటనలు పేర్కొన్నారు. ముఖ్య అతిథులుగా ఎమ్మెల్సీ ప్రొ.కోదండరామ్ హాజరవుతున్నారని తెలిపారు. నిజమైన ఉద్యమకారులను గుర్తించడం, వారు చేసిన సేవలను స్మరించుకోవడం జరుగుతుందని తెలిపారు. తెలంగాణ రాష్ట్ర సాధనలో వారి వారి పాత్రలను నెమరువేసుకుంటూ భవిష్యత్ తెలంగాణ అభివృద్ధిలో భాగస్వామ్యం కోసం అందరం ఏకం కావాలని తెలిపారు. ఈ సమ్మేళనానికి పెద్ద ఎత్తున ఉద్యమకారులు తరలి వచ్చి విజయవంతం చేయాలని కోరారు.

24న మైండ్ స్పార్క్ ఆధ్వర్యంలో వర్క్‌షాప్

నవతెలంగాణ-ఉట్నూర్

ఐటీడీఏ రీజినల్ పరిధిలోని ప్రాజెక్ట్ ఆఫీసర్లు, డీటీడీఓలు, ఏటీడీఓ, ఆర్సీఓ, హెడ్ మాస్టర్లు, గణితం, ఆంగ్లం, తెలుగు ఉపాధ్యాయులతో ఈనెల 24న ఉట్నూర్‌లో వర్క్‌షాప్ నిర్వహించనున్నట్టు పీఓ ఖుష్బు గుప్తా శుక్రవారం తెలిపారు. ఈ సమావేశ వివరాలను జైనూర్, తాడిహత్నూర్ పాఠశాలల ఐసీటీసీ నిర్వాహకుడు మిలింద్ కాంబ్లేను అడిగి తెలుసుకోవాలని అన్నారు.

ఆర్టీసీలో మర్యాద దినోత్సవం

నవతెలంగాణ-నిర్మల్

ప్రతి నెల మూడో శుక్రవారం ఆర్టీసీ మర్యాద దినోత్సవం పాటిస్తుందని నిర్మల్ డిపో మేనేజర్ ప్రతిమరెడ్డి అన్నారు. శుక్రవారం ప్రయాణికులకు పుష్పాలు అందజేస్తూ మాట్లాడారు. డ్యూటీ కండక్టర్లు, డ్రైవర్లు బస్సులో ఎక్కి ప్రయాణికులకు పుష్పాలను అందచేసి, ఆర్టీసీ బస్సులో ప్రయాణిస్తున్న మీ అందరికి ధన్యవాదాలు తెలుపుతూ ఆర్టీసీ బస్సులో ప్రయాణం సుఖవంతం, సురక్షితం ఆర్టీసీ బస్సులోనే ప్రయాణించాలని, క్షేమంగా గమ్యం చేరుకోవాలని కోరారు. చిరునవ్వుతో అందరిని పలకరిస్తూ శుభాకాంక్షలు తెలిపారన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ ఐ. రాజశేఖర్, కండక్టర్లు, డ్రైవర్లు పాల్గొన్నారు.

నేడు ఉట్నూర్‌లో మంత్రి సీతక్క పర్యటన

నవతెలంగాణ-ఉట్నూర్

మంత్రి సీతక్క శనివారం ఉట్నూర్‌లో పర్యటించి పలు అభివృద్ధి పనులను ప్రారంభించనున్నారని జల్లా కలెక్టర్ రాజర్షిషా అన్నారు. ఉట్నూర్‌లోని కేబీ కాంప్లెక్స్‌లో పలు అభివృద్ధి పనులను ప్రారంభిస్తారని అన్నారు. ఈ సందర్భంగా శుక్రవారం జిల్లా కలెక్టర్ రాజర్షిషా, జిల్లా ఎస్పీ గౌస్ ఆలం, ఐటీడీఏ పీఓ ఖుష్బు గుప్తాలతో కలిసి ఉట్నూర్ కేబీ కాంప్లెక్స్‌లోని ఇందిరా మహిళాశక్తి కార్యక్రమంలో భాగంగా కోళ్ల పెంపకం, మానసిక వికలాంగుల వికాసం స్కూల్, నూతనంగా నిర్మించిన డీఈడీ కళాశాలని పరిశీలించారు. అన్ని ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు.

నవతెలంగాణ
కుమురంభీం ఆసిఫాబాద్
శనివారం | సెప్టెంబర్ 21, 2024 | www.navatelangana.com

చిన్నారిని ఆశీర్వదించిన ఎమ్మెల్యే

నవతెలంగాణ-కౌటాల



మండల కేంద్రంలోని నామకరణ మహోత్సవం పాల్గొన్న సిర్పూర్ ఎమ్మెల్యే డా.పాల్వాయి హరీష్ బాబు శుక్రవారం వాసవి కన్యకాపరమేశ్వరి ఆలయంలో తుమ్మిడిహెట్టి గ్రామానికి చెందిన రేణికుంట్ల జనార్ధన్-కీర్తి గార్ల కుమార్తె నాంకారణ మహోత్సవంలో పాల్గొని చిన్నారిని ఆశీర్వదించినారు. ఆయన వెంట జిల్లా కార్యదర్శి బండి రాజేందర్ గౌడ్, మండల స్థాయి నాయకులు దుర్గం మోతిరాం, కుంచాల విజయ్, మేకల తిరుపతి ఉన్నారు.


పచ్చతోరణం ప్రభుత్వ పాఠశాల దారి

నవతెలంగాణ-కెరమెరి



పచ్చని తోరణాలతో ఆహ్వానం పలుకున్నతున్నట్టుంది ఆ ప్రభుత్వ పాఠశాలకు వెళ్లే దారి. దారి పొడవునా పచ్చని చెట్లు ఏ పుగా పెరిగి ఆహ్లాదాన్ని పంచుతూ, పాఠశాలకు వచ్చే విద్యార్థులకు, ఉపాధ్యాయులకు ఆహ్వానం పలుకుతున్నట్టు ఉంది. మండలంలోని సావర్ ఖేడ ప్రభుత్వ పాఠశాల మాజీ సర్పంచ్ కావుడే తులసీరాం కృషి, గ్రామస్తుల సహకారంతో మొక్కలు నాటి వాటిని సంరక్షించారు. ఇలా మొక్కలు పాఠశాల వాతావరణాన్ని ఆహ్లాదభరితంగా మార్చారు.

ప్రమాదకరంగా అంగన్‌వాడీ కేంద్రం



నవతెలంగాణ-కెరమెరి

పేరుకే మోడల్ అగన్వాడీ కేంద్రం మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీ అంగన్‌వాడీ కేంద్రం ప్రమాదకరంగా మారింది. పై కప్పు భాగంలో పగుళ్ల తేలి పెచ్చులూడి రంధ్రం ఏర్పడింది. ఐదేళ్ల లోపు పిల్లలు పౌష్టికాహారం కోసం ప్రతి రోజు హాజరవుతారు. పిల్లలు ఆటలాడుతున్న సమయంలో పై కప్పు పెచ్చులు పడితే ప్రమాదం సంభవించే అవకాశం లేకపోలేదు. గతంలో ప్రభుత్వం అంగన్‌వాడీల మరమ్మతులకు నిధులు కేటాయించి నప్పటికి నామ మాత్రంగా పనులు చేసి చేతులు దులుపుకున్నారని కాలనీ వాసులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు అంగన్వాడీ కేంద్రానికి పూర్తి స్థాయిలో మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు.

25 నుంచి మున్సిపాలిటీలో సమ్మె



నవతెలంగాణ-ఆసిఫాబాద్

ఈ నెల 25 నుంచి ఆసిఫాబాద్ మున్సిపాలిటీలో సమ్మె చేయనున్నట్లు మున్సిపల్ కార్మిక సంఘం గౌరవ అధ్యక్షుడు శ్రీకాంత్ హెచ్చరించారు. సీఐటీయూ జిల్లా నాయకుడు కృష్ణమాచారి జిల్లా అధ్యక్షుడు మాట్ల రాజు ఆధ్వర్యంలో మున్సిపల్ కమిషనర్ భుజంగరావుకు సమ్మె నోటీసు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పెండింగ్ వేతనాలు చెల్లించాలని ఇతర సమస్యలు పరిష్కరించాలని గత కొద్ది రోజులుగా వినతి పత్రాలు అందజేసినప్పటికీ అధికారులు స్పందించడం లేదన్నారు. అధికారులు సమస్యల పరిష్కారంపై ఈ నెల 25 లోపు నిర్ణయం తీసుకోకుంటే ఈ నెల 25 నుంచి సమ్మె చేయనున్నట్లు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సంఘం కార్యదర్శి తోట సమ్మయ్య, కోశాధికారి బాపురావ్, ఉపాధ్యక్షుడు సీహెచ్ శంకర్, ప్రభాకర్, ఎం.రాజు, నక్క మల్లేష్, ఇస్తారీ, సురేష్, వెంకట్, దుర్గ ప్రసాద్, పద్మ, కళావతి, లక్ష్మీ సాగర్ పాల్గొన్నారు.

వయోవృద్ధుల దినోత్సవ పురస్కారాలు

నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లాలో విశిష్ట సేవలు అందిస్తున్న వయోవృద్ధులు, సంస్థలకు అక్టోబర్ 1వ తేదీన నిర్వహించనున్న అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవం సందర్భంగా పురస్కారాలు అందించడం జరుగుతుందని, అర్హులైన వారు ఈ నెల 25వ తేదీ సాయంత్రం 5 గంటలలోగా హైదరాబాద్-మలక్ పేటలోని నల్గొండ క్రాస్ రోడ్డు బస్‌స్టాప్ సమీపంలో గల దివ్యాంగుల సంక్షేమ భవనంలో దరఖాస్తు చేసుకోవాలని జిల్లా సంక్షేమశాఖ అధికారి ఆడెపు భాస్కర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. దరఖాస్తు ఫారం, అర్హతలు, పురస్కారాల క్యాటగిరి ఇతర వివరాలకు ఆన్‌లైన్‌లో డబ్ల్యూడీఎస్‌సీ.తెలంగాణ.జీఓవీ.ఇన్ వెబ్‌సైట్‌లో సంప్రదించవచ్చని పేర్కొన్నారు.

జిల్లా స్థాయి షటిల్ బ్యాడ్మింటన్ ఎంపిక పోటీలు

నవతెలంగాణ-ఆసిఫాబాద్

పాఠశాల క్రీడ మైదానంలో శుక్రవారం అండర్-14, అండర్-17 బాల బాలికలకు జిల్లా స్థాయి షటిల్ బ్యాట్మెంటన్ ఎంపిక పోటీలు నిర్వహించారు. జిల్లా ఇన్‌చార్జి విద్యాధికారి ఉదయ బాబు పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో కూడా రాణించాలన్నారు. జిల్లా స్థాయి పోటీలకు వందమందికి పైగా విద్యార్థులు పాల్గొనడం సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు లక్ష్మయ్య, జిల్లా గిరిజన క్రీడల అధికారి మీనారెడ్డి, జిల్లా పాఠశాల ప్రధాన కార్యదర్శి సాంబశివరావు, మధుసూదన్, విద్యాసాగర్, శారద, వ్యాయామ ఉపాధ్యాయుడు ప్రవీణ్‌లు పాల్గొన్నారు.

డైట్ కళాశాలలో ప్రవేశాలు ప్రారంభించాలి



నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లా కేంద్రంలో జిల్లా ఇన్‌చార్జి మంత్రి చేతుల మీదుగా ప్రారంభించిన డైట్ కళాశాలలో ప్రవేశాలను వెంటనే ప్రారంభించాలని కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి దుర్గం దినకర్ డిమాండ్ చేశారు. కళాశాల భవనాన్ని పరిశీలించి అనంతరం మాట్లాడుతూ డైట్ కళాశాల భవనం ప్రారంభించడం బాగానే ఉన్నప్పటికీ ప్రవేశాలు చేయకపోవడం ఏంటని ప్రశ్నించారు. డైట్ కళాశాలలో ప్రవేశాల ప్రారంభిస్తే మారుమూల జిల్లా విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు గేడం టీకనంద్, గుడిసెల కార్తీక్, టిఏజీఎస్ జిల్లా అధ్యక్షురాలు కోరంగే మలశ్రీ, ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకులు భీమ్‌రావు, శ్రావణి పాల్గొన్నారు.

ఐసీడీఎస్‌ను యధావిధిగా కొనసాగించాలి

నవతెలంగాణ-ఆసిఫాబాద్



ఐసీడీఎస్‌ను నిర్వీర్యం చేయకుండా యధావిధిగా కొనసాగించాలని తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్(సీఐటీయూ) జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.త్రివేణి డిమాండ్ చేశారు. శుక్రవారం డీడబ్ల్యూఓ భాస్కర్‌కు సంఘం తరపున వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వరంగల్ జిల్లా గీసుకొండ మండలంలో మూడో తరగతి వరకు పూర్వ ప్రాథమిక విద్య ప్రారంభించాలని తీసుకున్న నిర్ణయాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలన్నారు. దీని వల్ల ఐసీడీఎస్ వ్యవస్థ నిర్వీర్యం అయ్యే ప్రమాదం ఉందన్నారు. పూర్వ ప్రాథమిక విద్య అనేది జాతీయ నూతన విద్యా విధానంలో భాగమని దీని ప్రవేశ పెట్టొద్దని ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వానికి చెప్పామన్నారు. స్వాతంత్ర్యం నంతరం దేశంలో ఉన్న పోషకాహార లోపం తగ్గించడానికి అంగన్‌వాడీ వ్యవస్థను అమల్లోకి తీసుకువచ్చిందని, దీంతో పోషకాహారలోప నివారణ సాధ్యమైందన్నారు. అంత గొప్ప చరిత్ర గల అంగన్‌వాడీ వ్యవస్థను నిర్వీర్యం చేసే దిశగా కేంద్ర ప్రభుత్వం నూతన విద్యా విధానాన్ని తీసుకువచ్చిందని విమర్శించారు. ప్రభుత్వం ఈ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని ఒకవేళ ప్రభుత్వం ఆ దిశగా చర్యలు తీసుకుంటే ఉద్యమాలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి ముంజం శ్రీనివాస్, యూనియన్ వర్కింగ్ ప్రెసిడెంట్ వనిత, సువర్ణ, సరోజ పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి రేషన్ డీలర్ల సదస్సు జయప్రదం చేయాలి



నవతెలంగాణ-ఆసిఫాబాద్

రేషన్ డీలర్ల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్‌తో ఈ నెల 24న నిర్వహించ తలపెట్టిన చలో సంగారెడ్డి రాష్ట్రస్థాయి రేషన్ డీలర్ల సదస్సును జయప్రదం చేయాలని రేషన్ డీలర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు రేగుంట కేశవ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని బీసీ సంక్షేమ సంఘ భవనంలో నిర్వహించిన రేషన్ డీలర్ల మండల అధక్షుడు రాపర్తి శ్రీనివాస్ అధ్యక్షతన నిర్వహించిన ఆసిఫాబాద్ డివిజన్ డీలర్ల సదస్సుకు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చాలీచాలని కమిషన్లతో డీలర్ వ్యవస్థను కొనసాగిస్తున్నామని, కుటుంబాన్ని పోషించుకోవడమే రేషన్ డీలర్లకు భారంగా మారిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల సందర్భంగా రేషన్ డీలర్లకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలని డిమాండ్ చేస్తూ సంగారెడ్డి జిల్లాలోని జీఎంఆర్ గార్డెన్‌లో ఈ నెల 24న నిర్వహించే తెలంగాణ రాష్ట్ర స్థాయి రేషన్ డీలర్ల సదస్సును జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు జాడి ఆత్మరామ్, ఆసిఫాబాద్ మండల గౌరవ అధ్యక్షులు ఆర్.శంకర్, నాయకులు నిమ్మల సత్యనారాయణ గౌడ్, కుందారం గోపాల్, సిహెచ్ తిరుపతి, సుధాకర్, ఆర్.పాండురంగ, దరుంభాయ్, భీమ్రావు, ప్రవళిక, బి.సతీష్, జి.రవీందర్, నాందేవ్, తిరుపతి పాల్గొన్నారు.

తల్లీబిడ్డలకు పోషకాహారం అందించాలి

నవతెలంగాణ-పెంచికల్‌పేట్



పోషణ అభియాన్ కార్యక్రమంలో తల్లి, బిడ్డలకు సంపూర్ణ పోషకాహారాన్ని అందించాలని సబ్ కలెక్టర్ శ్రద్ధ శుక్లా అన్నారు. శుక్రవారం మండలంలోని దరోగ పెల్లి గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ్ అభియాన్ కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పోషణ్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా గర్భిణీలు బాలింతలకు పోషక విలువలు కలిగిన ఆహార పదార్థాలపై అవగాహన కల్పించాలని సూచించారు. జాతీయ పోషణమాసం సందర్భంగా సిబ్బంది ప్రతి ఇంటికి వెళ్లి పోషణ, పోషకాహారం, పరిశుభ్రతపై వివరించాలని అన్నారు. ప్రతిరోజు గర్భిణీలకు, బాలింతలకు, పిల్లలకు పాలు గుడ్లు పోషక విలువలు కలిగిన ఆహారాన్ని అందించాలన్నారు. అనంతరం గర్భిణీలకు సీమంతాలను, చిన్నపిల్లలకు అన్నప్రాసన కార్యక్రమాన్ని నిర్వహించారు. స్త్రీలలో రక్తహీనత లేకుండా చేసేందుకు ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పోషకాహారాలను ఉచితంగా అందిస్తుందని, దానిని సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. కార్యక్రమంలో ఈడబ్ల్యూఓ భాస్కర్, జిల్లా కోఆర్డినేటర్ గోపాలకృష్ణ, ప్రాజెక్టు కోఆర్డినేటర్ ప్రవీణ్ నాయక్, సీడీపీఓ విజయలక్ష్మి తహసీల్దార్ వెంకటేశ్వరరావు, ఎంపీడీఓ అల్బర్ట్, అంగన్‌వాడీ సూపర్ వైజర్లు హసీనా, పద్మ షకీరా, అరుణ, శంకరమ్మ పాల్గొన్నారు.

పీఏసీఎస్ రికార్డులు స్వాధీనం

నవతెలంగాణ-బెజ్జూర్



మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో విత్తనాలు, ఎరువులు, ఇతర లావాదేవీల్లో జరిగిన అవకతవకల నేపథ్యంలో శుక్రవారం సిర్పూర్ అసిస్టెంట్ రిజిస్ట్రార్ అనంతలక్ష్మి ఆధ్వర్యంలో బెజ్జూర్ పీఏసీఎస్ రికార్డులను స్వాదీనం చేసుకున్నారు. 2017 సంవత్సరం నుండి 2023 వరకు లావాదేవీలకు సంబంధించిన రికార్డులు ఆన్‌లైన్‌లో నమోదు పూర్తి చేయకపోవడంతో రికార్డులను స్వాధీనం చేసుకున్నారు. డీసీఓ రాథోడ్ బిక్కు ఆదేశాల మేరకు రికార్డులను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు అధికారులు పీఏసీఎస్‌ను సందర్శించి అన్ని రకాల రికార్డులను పరిశీలించి 52 సెక్షన్, టీసీఎస్ యాక్ట్ 1964 ప్రకారం విచారణ నిమిత్తం రికార్డులను స్వాధీనం చేసుకున్నారు. సొసైటీకి సంబంధించిన పూర్తిస్థాయి లావాదేవీలు, ఇతర అంశాలను పరిశీలించి విచారణ చేపట్టనున్నట్లు ఆమె పేర్కొన్నారు. అత్యవసరమైన రికార్డులు అందుబాటులో ఉన్నట్లు ఆమె తెలిపారు. ఆమె వెంట సీనియర్ ఇన్స్‌పెక్టర్ లక్ష్మణ్, జూనియర్ ఇన్స్‌పెక్టర్ నాగేశ్వరరావు ఉన్నారు.

ప్రయాణికులతో మర్యాద పూర్వకంగా మెలగాలి



నవతెలంగాణ-ఆసిఫాబాద్

ఆర్టీసీ బస్సుల్లో, ప్రయాణ ప్రాంగణాలలో ప్రయాణికులతో సిబ్బంది మర్యాదపూర్వకంగా మెలగాలని డిపో మేనేజర్ విశ్వనాథ్ అన్నారు. శుక్రవారం ఆర్టీసీ మర్యాద దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బస్‌లలో ప్రయాణించే ప్రయాణికులకు పుష్పాలను అందజేశారు. ఈ సందర్భంగా డీఎం మాట్లాడుతూ విధి నిర్వహణలో సిబ్బంది చిరునవ్వుతో ప్రయాణికులను పలకరించి వారితో మర్యాదపూర్వకంగా మెలగాలని పేర్కొన్నారు. సురక్షితమైన ప్రయాణంలో ప్రతి ఒక్కరు మర్యాదగా మెలిగే విదంగా బస్‌లో అలాంటి వాతవరణాన్ని నెలకొప్పాలన్నారు. ఈ మర్యాద దినోత్సవాన్ని డిపోలో ప్రతినెల మూడవ శుక్రవారం నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో డీపీఓ సిబ్బంది పాల్గొన్నారు.

ఆసుపత్రిలో అన్ని సౌకర్యాలు కల్పిస్తా

- ఎమ్మెల్యే పాల్వాయి హరీష్ బాబు



నవతెలంగాణ-కౌటాల

మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని శుక్రవారం స్థానిక ఎమ్మెల్యే డా.పాల్వాయి హరీష్‌బాబు ఆకస్మికంగా తనిఖీ చేశారు. నార్మల్ డెలివరీ ద్వారా పుట్టిన నవజాత శిశువును పరీక్షించారు. అనంతరం వైద్య సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించి, ఆస్పత్రిలో కావలసిన సదుపాయాల గురించి అడిగి తెలుసుకున్నారు. మెడికల్ ఆఫీసర్ మాట్లాడుతూ ఒక జనరేటర్, ఓటి టేబుల్, ఓటీ లైట్లు, ఫ్యాన్లు, ఏసీలు, స్ట్రెచర్లు, వీల్ చైర్లు తదితర పరికరాలు అవసరం ఉన్నాయని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే స్పందించిన ఎమ్మెల్యే నిధులు మంజూరు చేయిస్తామని, సరైన సౌకర్యాలు కల్పిస్తామని హామీ ఇచ్చారు. అలాగే కౌటాల పీహెచ్‌సీలో ఒక డయాలసిస్ సెంటర్ ఏర్పాటుకు కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో డా.సుంకన్న, జిల్లా కార్యదర్శి బండి రాజేందర్ గౌడ్, మాజీ ఎంపీటీసీ దుర్గం మోతిరాం, మాజీ సర్పంచ్ దుర్గం యశ్వంత్, కుంచాల సత్తయ్య, మేకల తిరుపతి, వెంకటేష్, అశోక్, రవి, చందు, మధుకర్, భూమయ్య పాల్గొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయునికి సన్మానం



నవతెలంగాణ-ఆసిఫాబాద్

ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా జిల్లా కేంద్రంలో ట్రస్మ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఉత్తమ ఉపాధ్యాయునిగా అవార్డు పొందిన జిల్లా కేంద్రాల్లోని సరస్వతి శిశు మందిర్‌కు చెందిన శ్రీరామ్ సత్యనారాయణను పాఠశాలలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సత్యనారాయణ సేవలను పలువురు కొనియాడారు. ఈ కార్యక్రమంలో ట్రస్మా జిల్లా అధ్యక్షుడు దేవభూషణం, జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ రాధాకృష్ణ చారి, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కోటేశ్వరరావు, గుర్రాల హరిప్రియ, చిప్ప రమాదేవి, కట్కూరి స్వాతి, కాంద్రే దుర్గ, కల్లూరి వైష్ణవి పాల్గొన్నారు.

ఆర్టీసీ కార్మికుల సంక్షేమమే లక్ష్యం



నవతెలంగాణ-ఆసిఫాబాద్

ఆర్టీసీ కార్మికుల సంక్షేమం లక్ష్యమని డిపో మేనేజర్ విశ్వనాథ్ తెలిపారు. శుక్రవారం డిపో గ్రాండ్ హెల్త్ చాలెంజ్ కింద వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఆర్టీసీ సిబ్బందికి వైద్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన మందులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్టీసీ కార్మికుల సంక్షేమం కోసం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ శిబిరం ఈ నెల 24 వరకు కొనసాగుతుందని వివరించారు. సిబ్బంది దీనిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. హైదరాబాద్ నుంచి వచ్చిన ప్రత్యేక వైద్య బృందం సిబ్బందికి పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎస్టీయూ సరియా, లీడింగ్ హ్యాండ్ నాగరాజు, హెల్త్ వాలంటరీ ప్రేమల, ఉద్యోగస్తులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి సైన్స్‌ఫేర్‌కు ఎంపికైన విద్యార్థులు

నవతెలంగాణ-ఆసిఫాబాద్



జిల్లా కేంద్రాల్లోని సరస్వతి శిశు మందిర్ పాఠశాలకు చెందిన విద్యార్థులు గోదావరిఖనిలో విద్యాపీఠం ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కోటేశ్వర్ రావ్ తెలిపారు. ఎంపికైన విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 25, 26, 27 తేదీల్లో హైదరాబాదులో జరిగే రాష్ట్రస్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబరిచి పాఠశాలకు పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ట్రస్మా జిల్లా అధ్యక్షుడు శ్రీ దేవభూషణం, రాధాకృష్ణ చారి, గుర్రాల హరిప్రియ, చిప్ప రమాదేవి, వైష్ణవి, స్వాతి, కాంద్రే దుర్గ, శ్రీరాం సత్యనారాయణ, చాపిడి దీపక్ కుమార్ పాల్గొన్నారు.

నేషనల్ హెల్త్ మిషన్ ఉద్యోగుల సర్టిఫికెట్ల పరిశీలన

నవతెలంగాణ-ఆసిఫాబాద్

ప్రధానమంత్రి జన్ మన్ కింద ఒప్పంద ప్రాతిపదికన భర్తీ చేసే పోస్టులకు సంబంధించి జాతీయ ఆరోగ్య పథకం కింద జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో స్టాఫ్ నర్స్, ల్యాబ్ టెక్నీషియన్, పారామెడికల్ సహాయ సిబ్బంది ఉద్యోగాలకు పీవీటీజీ అభ్యర్థుల సర్టిఫికెట్ల వెరిఫికేషన్ ప్రక్రియను అదనపు కలెక్టర్ దాసరి వేణు, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి తుకారాం భట్‌తో కలిసి పూర్తి చేశారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ప్రధానమంత్రి జన్‌మన్ క్రింద పీవీటీజీ అభ్యర్థులతో పోస్టులు భర్తీ చేయడం జరిగిందని, ఇందులో 7 స్టాఫ్ నర్స్, 5 ల్యాబ్ టెక్నీషియన్, 6 పారామెడికల్ సహాయ సిబ్బంది పోస్టులను భర్తీ చేసినట్లు వివరించారు. ఎంపికైన అభ్యర్థులు నిబద్ధతతో పనిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో వైద్య ఆరోగ్యశాఖ అధికారులు ప్రశాంత్ పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
మంచిర్యాల
శనివారం | సెప్టెంబర్ 21, 2024 | www.navatelangana.com

కిషోర బాలికలు పౌష్టికాహారం తీసుకోవాలి

నవతెలంగాణ-నస్పూర్



కిశోర బాలికలు పౌష్టికాహారం తీసుకోవాలని మంచిరాల సీడీపీఓ చందన అన్నారు. శుక్రవారం పోషణ మాసం సందర్భంగా మంచిర్యాల కేజీబీవీ పాఠశాలలో కిషోర్ బాలికలు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పోషకాహారం, పరిశుభ్రతల గురించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీడీపీఓ మాట్లాడుతూ బాలికలు రక్తహీనత లేకుండా పోషక విలువలతో కూడిన ఆహారం తీసుకోవాలని, సకాలంలో వైద్య పరీక్షలు చేయించుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఓ స్వప్న, సూపర్‌వైజర్ జ్యోతి, రమా, సతీష్, అంగన్‌వాడీ టీచర్లు మాధవి, షరీఫా పాల్గొన్నారు.

రొట్టెపల్లిలో రోడ్డు వేసి నీటి సమస్యను పరిష్కరించాలి

నవతెలంగాణ-కాసిపేట

మండలంలో రొట్టెపల్లి గ్రామానికి రోడ్డు సౌకర్యం కల్పించడంతో పాటు నీటి సమస్య పరిష్కరించాలని బీజేపీ మండల అధ్యక్షుడు సూరం సంపత్ డిమాండ్ చేశారు. శుక్రవారం మండలంలోని రొట్టెపల్లి పంచాయతీలో రోడ్లు లేక, నీటి సమస్యతో గ్రామస్తులు ఇబ్బందులు పడుతున్నట్లు తెలుసుకొని బీజేపీ ఆధ్వర్యంలో గ్రామాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా బీజేపీ మండల అధ్యక్షులు సూరం సంపత్ మాట్లాడుతూ ప్రస్తుతం ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం గతంలో ఉన్న బీఆర్ఎస్ ప్రభుత్వం ఓట్లపుడే ప్రజలు గుర్తుకొస్తారా అని ప్రశ్నించారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వం ఉన్నప్పుడు గ్రామంలో శంకుస్థాపన కొబ్బరికాయలు కొట్టి రోడ్డు పనులు ప్రారంభించలేదని అన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు సతీష్, బీజేవైఎం నాయకుడు చొప్పదండి విష్ణువర్ధన్, రవి, రంజిత్, గ్రామస్తులు పోగుల శంకర్, అనిల్, విష్ణు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి పోరాటం

- సీపీఐ(ఎం) మండల కార్యదర్శి కనికరం అశోక్



నవతెలంగాణ-జన్నారం

ప్రజా సమస్యల పరిష్కారానికి సీపీఐ(ఎం) పోరాటం చేస్తుందని ఆ పార్టీ మండల కార్యదర్శి కనికరం అశోక్ అన్నారు. శుక్రవారం మండలం మురిమడుగు గ్రామంలో ఆ పార్టీ శాఖ మహాసభను నిర్వహించారు. ముందుగా ఇటీవలే మృతి చెందిన సీపీఐ(ఎం) జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు. అనంతరం సమావేశంలో గ్రామంలో ఉన్న సమస్యలపై చర్చించారు. గ్రామ కార్యదర్శిగా కొండగుర్ల లింగన్నను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు కూకట్కారి బుచ్చయ్య, అంబటి లక్ష్మణ్, లింగన్న, రాజన్న, లక్ష్మి పాల్గొన్నారు.

నేటి రాష్ట్ర బంద్‌ను విజయవంతం చేయాలి

నవతెలంగాణ-కాసిపేట

కుంరంభీం జిల్లా జైనూర్ మండలంలో ఆదివాసీ మహిళపై జరిగిన అఘాయిత్యాన్ని ఖండిస్తూ నిరసనగా బాధితురాలికి న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ ఆ ఘటనకు వ్యతిరేకంగా ఆదివాసీ సంఘాల తలపట్టిన బంద్‌కు ఆదివాసీ సేన సంపూర్ణ మద్దతు ఇస్తుందని, రాష్ట్ర బంద్‌ను విజయవంతం చేయాలని ఆదివాసీ సేనా మండల అధ్యక్షుడు మడావి వెంకటేష్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్ర బంద్‌లో ఆదివాసీ సంఘాలు, అనుబంధ సంఘాలు, ఆదివాసీలు అందరూ పాల్గొని విజయవంతం చేయాలని పేర్కొన్నారు. వ్యాపార, వాణిజ్య, విద్యా సంస్థలు, కళాశాలలు, అందరూ సహకరించాలని కోరారు.

108 అంబులెన్స్‌లో ఆడ శిశువు జననం

నవతెలంగాణ-జన్నారం



మండలం లోతొర్రే గ్రామానికి చెందిన రూపా అనే మహిళ పురిటి నొప్పులతో బాధపడుతుండగా ఆమె భర్త సంజీవ్ శుక్రవారం 108 సిబ్బందికి సమాచారం అందించాడు. అంబులెన్స్ సిబ్బంది ఆమెను ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గ మధ్యలోనే ఆమె పురిటి నొప్పులు ఎక్కువ అవడంతో, జన్నారం పట్టణానికి సమీపాన 108 అంబులెన్స్‌లోనే ఆమె ప్రసవించింది. ఆడ శిశువుకు జన్మనిచ్చింది. ప్రస్తుతం తల్లి బిడ్డలకు క్షేమంగా ఉన్నట్లు 108 ఈఎంటీ జాడి రమేష్ పైలట్ సంపత్ తెలిపారు. తల్లి బిడ్డలను లక్షెట్టిపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించామన్నారు.

ఉచిత కంటి వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలి

నవతెలంగాణ-దండేపల్లి

ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్ సాగర్‌రావు జన్మదినం పురస్కరించుకొని మండల కేంద్రంలో గుమ్మడి రాజలింగం ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు కాంగ్రెస్ మండల అధ్యక్షుడు అక్కల వెంకటేశ్వర్లు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉచిత కంటి వైద్య శిబిరాన్ని మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. పేద ప్రజల కోసం ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు నిరంతరం కృషి చేస్తున్నారని ఆయన అన్నారు. కొక్కిరాల రఘుపతిరావు ట్రస్ట్ ద్వారా అనేక సేవా కార్యక్రమాలు చేపడుతున్నారని అన్నారు. ఈ అవకాశాన్ని మండల ప్రజలు అందరు వినియోగించుకోవాలని కోరారు.

విద్యుత్ సమస్యను పరిష్కరిస్తాం



నవతెలంగాణ-జన్నారం

మండలంలోని గిరిజన గ్రామమైన బంగారు తండా గ్రామంలో విద్యుత్ సమస్య ఉందని ఆ గ్రామస్తులు ఐటీడీఏ పీఓకు దరఖాస్తు చేయగా, స్పందించిన విద్యుత్ అధికారులు శుక్రవారం, ఆ గ్రామానికి వెళ్లి రైతులతో మాట్లాడి వారం రోజుల్లో సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. సందర్భంగా విద్యుత్ ఎస్ఈఈ శ్రావణ్ మాట్లాడుతూ గ్రామంలోని పొలాల్లో ఉన్న విద్యుత్ సమస్యను పంటలు పూర్తయిన వెంటనే పరిష్కరిస్తామన్నారు. అప్పటివరకు రైతులు సంయమనం పాటించాలన్నారు. డీఈ ఎండీ కైసర్, ఏడిఈ టెక్నికల్ తిరుపతి, ఏడిఈ ప్రభాకర్ ఏఈ లచ్చన్న, గ్రామ రైతులు పాల్గొన్నారు.

అతిధి అధ్యాపకుల భర్తీకి దరఖాస్తుల స్వీకరణ

నవతెలంగాణ-లక్షెట్టిపేట

లక్షెట్టిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అతిధి అధ్యాపకులుగా పనిచేసేందుకు అర్హులైన వారి నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ఆ కళాశాల ప్రిన్సిపాల్ డా.మహాత్మ సంతోష్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఖాళీల వివరాలు.. ఇంగ్లీష్ -1, తెలుగు-1, రసాయనశాస్త్రం-1, వృక్షశాస్త్రం-1, జంతుశాస్త్రం-1, చొప్పున మొత్తం 5 ఖాళీలు ఉన్నాయి. వీటికోసం దరఖాస్తు చేసుకునేందుకు అర్హతలు అభ్యర్థులు సంబంధిత సబ్జెక్టులో పీజీ పూర్తిచేసి 55 శాతం మార్కులు పొంది ఉండాలి. ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు 50 శాతం మార్కులు ఉంటే సరిపోతుంది. 2. పిహెచ్డి సెట్, నెట్ అభ్యర్థులకు ప్రాధాన్యత ఉంటుంది. డిగ్రీలో బోధన అనుభవం ఉన్నవారికి వెయిటేజీ ఇవ్వబడును. అర్హులైన అభ్యర్థులు తమ దరఖాస్తులను తేదీ 24 సెప్టెంబర్‌లోగా సాయంత్రం 4 గంటలలోపు ప్రభుత్వ డిగ్రీ కళాశాల, లక్షెట్టిపేట కార్యాలయంలో సమర్పించాలి. దరఖాస్తు దారులకు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈ నెల 25 ఉదయం 10:30 గంటలకు డెమో, ఇంటర్వ్యూలు నిర్వహించ బడును. అభ్యర్థులు ఒరిజినల్ ధ్రువ పత్రాలతో హాజరు కావాలని తెలిపారు.

ప్రధాన ఆస్పత్రిలో పార్కింగ్ సమస్య

- అడ్డగోలుగా నిలుపుతున్న వాహనాలు
- నడవడానికి వీలులేకుండా పెడుతున్న జనాలు



ప్రభుత్వ ఆస్పత్రి ఆవరణలో నిలిపిన ప్రయివేట్ అంబులెన్స్, ఆటో లు



ఇష్టానుసారం నిలిపి ఉంచిన వాహనాలు

నవతెలంగాణ-మంచిర్యాల

జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ప్రధాన ఆస్పత్రిలో పార్కింగ్ సమస్య తీవ్రమవుతోంది. సరైన పార్కింగ్ వ్యవస్థ లేక పోవడంతో బయట వ్యక్తులే ఎక్కువ వాహనాలను హాస్పిటల్ ఆవరణలో పార్కింగ్ చేసి వెళ్తున్నారు. దీనితో హాస్పిటల్‌కు వచ్చే రోగులకు, పేషెంట్స్‌ను తీసుకొని వచ్చే ప్రభుత్వ అంబులెన్సులకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. పార్కింగ్ ఫ్రీ కావడంతో జిల్లా కేంద్రం నుంచి వేరే ప్రాంతాలకు ఉద్యోగాలు, ఇతర పనుల మీద వెళ్లే వారు హాస్పిటల్ ఆవరణలో వారి వాహనాలను పార్కింగ్ చేసి వారి వారి పనుల నిమిత్తం వెళ్తున్నారు. ఇలా ఇష్టం వచ్చినట్లు పార్కింగ్ చేసిన వాహనాలను సరి చేయడంలో సెక్యూరిటీ సిబ్బంది అవస్థలు పడుతున్నారు.హాస్పిటల్‌కు వచ్చే వారే కాకుండా బయట వ్యక్తులు ఎక్కువ వాహనాలను హాస్పిటల్ లో పార్కింగ్ చేయడంతో ఇష్టానుసారం పార్కింగ్ చేసిన ఆ వాహనాలను సరి చేయడమే సెక్యూరిటీ సిబ్బందికి నిత్యం డ్యూటీగా మారుతుంది. హాస్పిటల్‌కు వచ్చే వారి వాహనాలతో పాటు డాక్టర్‌ల వాహనాలు నిలపడం కూడా పెద్ద సమస్యగా మారింది. ఇటీవల మాత శిశు కేంద్రన్ని ప్రభుత్వ జనరల్ హాస్పిటల్‌కు తరలించడం తో నిత్యం గర్భిణులను తీసుకొని వచ్చే ప్రభుత్వ అంబులెన్స్‌లు హాస్పిటల్ ప్రంగానం లోకి రావాలంటే పెద్ద యుద్ధమే చేయాల్సి వస్తుంది. మెయిన్ ఎంట్రన్స్ నుంచి పార్కింగ్ చేసి ఉన్న వాహనాలతో లోపలికి వెళ్లేందుకు ప్రభుత్వ అంబులెన్సు డ్రైవర్ లు ఇబ్బందులు పడుతున్నారు. ఇంకా ఎమర్జెన్సీ కేసులను తీసుకోచ్చే సమయంలోను ఈ ఇబ్బందులు తప్పడం లేదు. ప్రభుత్వ అంబులెన్సు డ్రైవర్‌లు బయట నుంచి పేషెంట్స్‌ను తీసుకెళ్లాల్సిన ప్రయివేట్ అంబులెన్సు డ్రైవర్‌లు ఏకంగా ప్రభుత్వ ఆస్పత్రిలో నిలిపి రోగులను తరలించుకుంటున్నారు. దీనితో మరింత పార్కింగ్ సమస్య పెరుగుతోంది. సెక్యూరిటీ సిబ్బంది. హాస్పిటల్ ఆవరణలోకి బయటి వ్యక్తుల వాహనాలు, ప్రయివేట్ అంబులెన్సులు, ఆటోలు రాకుండా అధికారులు చర్యలు చేపడితే ఆస్పత్రికి వచ్చే రోగులకు, ప్రభుత్వ అంబులెన్సులకు ఈ తిప్పలు తప్పుతాయంటున్నారు. ఎవరైనా అధికారులు, ప్రజా ప్రతి నిధులు హాస్పిటల్ సందర్శనకు వచ్చి నప్పుడే హడావుడిగా వాహనాలను హాస్పిటల్ ప్రాంగణం నుంచి తొలగిస్తున్నారు తప్ప పార్కింగ్‌తో ఏర్పడే సమస్యలకు చర్యలు చేపట్టడంలో అధికారులు విఫలం అవుతున్నారు.

30న చలో హైదరాబాద్ విజయవంతం చేయాలి

నవతెలంగాణ-నస్పూర్



నాలుగు లేబర్ కోడ్‌లు, మూడు నేర చట్టాలను రద్దు చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ సెప్టెంబర్ 30న ఛలో హైదరాబాద్ ధర్నాకు అన్ని వర్గాల కార్మికులు పాల్గొని విజయవంతం చేయాలని సింగరేణి కాలరీస్ కట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (ఎస్సీసీడబ్ల్యుయూ -ఐఎఫ్టీయూ) రాష్ట్ర అధ్యక్షుడు బ్రహ్మానందం అన్నారు. శుక్రవారం శ్రీరాంపూర్ కాలనీలో సింగరేణి కాలరీస్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్(ఎస్‌సీసీ డబ్ల్యుయూ-ఐఎఫ్‌టీయూ) ఆధ్వర్యంలో పోస్టర్లు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ రంగ సంస్థలైనటువంటి బొగ్గు గనులు, రైల్వే, ఎల్ఐసీ, బీఎస్ఎన్ఎల్, బ్యాంకింగ్, తదితర వాటన్నింటిని ప్రయివేట్ పరం చేయడం, పెట్టుబడిదారులకు అమ్మివేయడాన్ని కేంద్ర ప్రభుత్వం తక్షణమే ఆపాలని డిమాండ్ చేశారు. కాంట్రాక్ట్ అండ్ అవుట్ సోర్సింగ్, స్కీం వర్కర్స్, కేజీబీవీ, అంగన్‌వాడీ, ఆశా, ఎస్సీ, బీసీ, హాస్టల్ వర్కర్స్, తదితరులను పర్మినెంట్ చేయాలని, హమాలీ కార్మికులకు సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలన్నారు. భవన ఇతర నిర్మాణ రంగ కార్మికుల సంక్షేమం కోసం ఏర్పాటు చేసిన వెల్ఫేర్ బోర్డును ప్రయివేట్ ఇన్సూరెన్స్ కంపెనీలకు అప్పజెప్పడాన్ని వ్యతిరేకిస్తూ, బీడీ కార్మికులకు కనీస వేతన జీఓలతో పాటు, పెండింగ్‌లో ఉన్న 73 షెడ్యూల్డ్ రంగాలకు సంబంధించిన జీఓలను పెరుగుతున్న ధరలకు అనుగుణంగా విడుదల చేయాలన్నారు. సింగరేణి కాంట్రాక్ట్ కార్మికులకు కోల్ ఇండియాలో చెల్లించినట్లు వేతనాలు చెల్లించాలని, కార్మిక వర్గం ఎదుర్కొంటున్న అనేక సమస్యలను పరిష్కరించాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మేకల రామన్న, పోతుల కిష్టన్న, అప్పారావు, సమ్మయ్య, వెంకన్న, శంకర్, రాంబాబు, రాము, విజయేందర్, సుధాకర్, ఎల్లయ్య, సురేష్, సత్య, శారద, కవిత, స్వప్న, మల్లేశ్వరి, లక్ష్మి, విజయ, సుప్రియ పాల్గొన్నారు.

గీత కార్మికులకు అబ్కారీశాఖ ఆధ్వర్యంలో శిక్షణ



- కాటమయ్య సురక్షా కవచ్ రక్షణ కిట్లు వాడాలి
- మంచిర్యాల అబ్కారీ సీఐ గురువయ్య

నవతెలంగాణ-హాజీపూర్

మండలం వేంపల్లి గ్రామ శివారులోని తాటి చెట్ల వనంలో శుక్రవారాం మంచిర్యాల, లక్సెట్టిపేట అబ్కారీ స్టేషన్ల ఆధ్వర్యంలో గీతా కార్మికులకు కాటమయ్య సురక్షా కవచ్ రక్షణ కిట్లపై ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. జిల్లా అబ్కారీ అధికారి నందగోపాల్ పర్యవేక్షణలో చేపట్టిన శిక్షణ కార్యక్రమంలో భాగంగా గీత కార్మికులు తమ కుల వృత్తిలో మెరుగ్గా రాణించాలని, తాటి, ఈత చెట్లను ఎక్కేటప్పుడు ఎలాంటి ప్రమాదాల బారిన పడకుండా రాష్ట్ర ప్రభుత్వం కాటమయ్య సురక్షా కవచ్ శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహిస్తోందని మంచిర్యాల ఎక్సైజ్ సీఐ జి.గురువయ్య తెలిపారు. గీతా కార్మికులు తమ వృత్తిలో ఉన్న సమయంలో ఎలాంటి ప్రమాదాలకు గురి కాకుండా ఉండాలని ముందస్తు ఆలోచనతో భద్రత పరికరాలతో కూడి కిట్లను త్వరలో అందుబాటులోకి తీసుకురానుందని అన్నారు. మాస్టర్ ట్రైనర్ల ద్వారా గీతా కార్మికులకు తగిన మెళకువలతో శిక్షణ పూర్తి చేస్తామని ఆపై గీత కార్మికులకు క్షేత్రస్థాయిలో భద్రతా కిట్లను అందజేసేలా ప్రభుత్వం కృషి చేస్తుందని అన్నారు. శిక్షణలో బీసీ సంక్షేమాధికారి వినోద్, మంచిర్యాల అబ్కారీ ఎస్సై మనీషారాథోడ్, అబ్కారీ సిబ్బంది, మంచిర్యాల, నస్పూర్, హాజీపూర్, లక్సెట్టిపేట మండలాల పరిధిలోని గీతా కార్మికులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆస్పత్రిలో గర్భిణులకు వైద్య పరీక్షలు

నవతెలంగాణ-తాండూర్



తాండూర్ ప్రభుత్వ ఆస్పత్రిలో శుక్రవారం మాదారం, నర్సాపూర్ సబ్ సెంటర్ల పరిధిలోని గ్రామాల చెందిన గర్భిణీ స్త్రీలకు వైద్యాధికారి ఝాన్సీ పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి మాట్లాడుతూ తాండూరు ప్రభుత్వ ఆస్పత్రిలో గర్భిణులకు ప్రతి శుక్రవారం వైద్య పరీక్షలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఆరోగ్య పరీక్షలు రక్త పరీక్షలు నిర్వహించి రక్తంలో హిమోగ్లోబిన్ తక్కువగా ఉన్న గర్భిణీలకు రక్త నిల్వలు పెరిగేందుకు మందులు అందించడం జరుగుతుందన్నారు. రక్తహీనత గల గర్భిణీల వివరాలను మాతా శిశు సంక్షేమ శాఖకు అందించి పౌష్టికాహారాన్ని అందించే విధంగా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు .తాండూర్ ప్రభుత్వ ఆస్పత్రిలో ప్రతి మంగళవారం ఆరోగ్య మహిళా కార్యక్రమంలో భాగంగా మహిళలందరికీ వైద్య పరీక్షలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. మండలంలో ఏడు సబ్ సెంటర్లు ఉండగా ప్రతి శుక్రవారం 2 సబ్ సెంటర్ల గర్భిణీలకు పరీక్షలు నిర్వహించడం జరుగుతుందన్నారు. మహిళలు గర్భం దాల్చిన సమయంలో సమతుల ఆహారాన్ని తీసుకుంటూ వైద్యుల సలహాలు పాటించాలని సూచించారు. ప్రభుత్వ ఆస్పత్రిలో ప్రసవం జరిగేందుకు అన్ని వసతి సౌకర్యాలు ఉన్నాయని తెలిపారు. గర్భిణీలకు ఏఎన్ఎంలు పారిజాతం, పుష్ప, తిరుపతమ్మ సలహాలు సూచనలు చేశారు

కబ్జా అయిన చెరువు భూములను స్వాధీనం చేసుకోవాలి



నవతెలంగాణ-జన్నారం

మండలంలోని అన్ని గ్రామాల్లో ఉన్న చెరువుల భూముల హద్దులను గుర్తించి సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని, అలాగే గతంలో చెరువు భూములు కబ్జా అయితే వాటిని గుర్తించి భూములను స్వాధీనం చేసుకోవాలని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ముజాఫర్ అలీ ఖాన్, ప్రధాన కార్యదర్శి మేకల మాణిక్యం అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో ఎన్నో చెరువులు కబ్జాకు గురయ్యాయి అన్నారు. వాటిని రెవెన్యూ అధికారులు గుర్తించి, స్వాధీనం చేసుకోవాలన్నారు. హైదరాబాదులో అక్రమాలపై హైడ్రా నిర్వహిస్తున్న చర్యల మాదిరిగా, జన్నారంలో కూడా అధికారులు సర్వేలు నిర్వహించి వెంటనే అక్రమార్కులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నామన్నారు. అనంతరం తహసీల్దార్ రాజ వర్ధన్‌రెడ్డికి వినతి పత్రం అందించారు. ఈ కార్యక్రమంలో జన్నారం మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థులకు స్పోర్ట్స్ యూనిఫామ్‌ల పంపిణీ



నవతెలంగాణ-హాజీపూర్

హాజీపూర్ మండలం సబ్బెపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని 155 మంది విద్యార్థులకు శుక్రవారం జిల్లా విద్యా శాఖా అధికారి యాదయ్య చేతుల మీదుగా స్పోర్ట్స్ యూనిఫాంలను అందజేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు వి. సుధారాణి స్వయంగా రూ.70 వేలు వెచ్చించి మరీ సోర్ట్స్ యూనీఫాంలను సమకూర్చింది. వారంలో రెండు సార్లు, ప్రత్యేక కార్యక్రమాల్లో ఉపయోగించుకునేలా విద్యార్థులను నాలుగు విభాగాలు చేసి నాలుగు రకాల రంగులతో రూపొందించిన స్పోర్ట్స్ యూనిఫాంలను సిద్ధం చేయించారు. యూనీఫాంలను అందజేసిన డీఈఓ యాదయ్య మాట్లాడుతూ, పాఠశాల విద్యార్థుల కోసం ప్రధానోపాధ్యాయురాలు సుధారాణి సొంత డబ్బులు వెచ్చించి స్పార్ట్స్ యూనీఫాంలు అందజేయడం అభినందనీయమని, విద్యార్థులు ఇలాంటి అవకాశాలను సద్వినియోగం చేసుకుని భవిష్యత్తులో ఉన్నత స్థాయికి ఎదగాలని కోరుకున్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు బండి రమేశ్, శారద, మంజుల, సత్యం, రాజశేఖర్, నాగప్రసాద్, ప్రసాద్‌రావు, కళ్యాణి, జుబేదా, లక్ష్మి శ్రీనివాస్, శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటు కోసం దరఖాస్తు చేసుకోండి

- ట్రస్మా మాజీ రాష్ట్ర అధ్యక్షుడు యాదగిరి శేఖర్‌రావు



నవతెలంగాణ-జన్నారం

వచ్చే పట్టాభద్రుల ఎమ్మెల్సీ ఓట్ల కోసం ప్రతి ఒక్కరు దరఖాస్తు చేసుకోవాలని, ట్రస్మా రాష్ట్ర మాజీ అధ్యక్షుడు యాదగిరి శేఖర్‌రావు అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 2021 నవంబర్ ఆరవ తేదీ వరకు ఉన్న పట్టభద్రుడు తప్పనిసరిగా తమ ఓటు నమోదు చేసుకోవాలన్నారు. అందుకుగాను దరఖాస్తు ఫారంతో సహా డిగ్రీ మేమొ, ఆధార్ కార్డు ఒక ఫోటోతో ఫామ్ నింపి గెజిటెడ్ అధికారితో సంతకం చేయించి తహసీల్దార్ కార్యాలయంలో అందించాలన్నారు. అలాగే ఆదిలాబాద్ నిజాంబాద్, మెదక్, కరీంనగర్ ఉమ్మడి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీగా అన్ని కుల సంఘాలు అన్ని పార్టీల మద్దతుతో తన బరిలో ఉంటున్నానని స్థానికుడైన తనకు ఓటు వేసి పట్టభద్రులు భారీ మెజార్టీతో గెలిపించాలన్నారు. నిరుద్యోగుల కోసం ఉద్యోగుల కోసం పట్టభద్రుల కోసం, ప్రవేట్ పాఠశాలల కోసం తన గలాన్ని శాసన మండలిలో వినిపిస్తా అన్నారు. ప్రతి ఒక్కరు తప్పకుండా తమ ఓటు నమోదు చేసుకోవాలని సూచించారు.

పునరావాస స్థలాల సందర్శనకు మల్యాల గిరిజనులు

నవతెలంగాణ-జన్నారం

మండలంలోని మల్యాల గిరిజనులను, అడవుల నుంచి తరలించడానికి, ప్రభుత్వం నిర్ణయించగా, వారికి ఏర్పాటు చేసిన స్థలాలను సందర్శించడానికి శుక్రవారం లారీలలో అటవీ అధికారులు తరలించారు. ఈ సందర్భంగా తాళ్లపేట ఎఫ్ఆర్ఓ సుష్మారావు మాట్లాడుతూ మల్యాల గిరిజనలను, మంచిర్యాల జిల్లాలోని, హాజీపూర్ మండలం, ముల్కల గ్రామాల మధ్యలో ఉన్న స్థలాలను సందర్శించడానికి పంపించామన్నారు. ఆ స్థలాలు గిరిజనులకు నచ్చినట్లయితే, ఆ స్థలాల్లో అన్ని సౌకర్యాలు కల్పించి, వారిని మల్యాల అడవి నుంచి తరలిస్తామన్నారు. గిరిజనులతోపాటు అటవీ అధికారులు తరలి వెళ్లారు.

జన్నారం బంద్‌కు సహకరించాలి

నవతెలంగాణ-జన్నారం

జైనురు ఘటనపై ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ అన్ని ఆదివాసీ సంఘాల ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర బంధుకు పిలుపు మేరకు మండల ప్రజలు సహకరించి బందులో పాల్గోవాలని తుడుం దెబ్బ మండలం నాయకులు అన్నారు. శుక్రవారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. జైనూర్‌లో ఆదివాసి మహిళపై లైగిక దాడి, హత్యాయత్నంపై రాష్ట్ర ప్రభుత్వం, రాష్ట్ర గవర్నర్ స్పందించకపోవడం పట్ల శాంతియుత బంధుకు పిలుపునిస్తున్నామన్నారు. శనివారం మండలంలోని అన్ని వాణిజ్య సంస్థలు, ప్రభుత్వ ప్రయివేటు విద్యాసంస్థలు బందు పాటించి సహకరించగలరని కోరారు. మండలంలోని అన్ని ఆదివాసీ కుల సంఘాల ఆధ్వర్యంలో బంధు పిలుపు ఇవ్వడం జరిగిందని అన్నారు. కార్యక్రమంలో ఆదివాసీ సంఘం నాయకులు పూసం సోనేరావుపటేల్, రాయచడం కాశీ, ధర్ము పటేల్, తుంరం లక్ష్మణ్, తొడసం గంగుపటేల్, సిడం జంగు, అత్రం ప్రభాకర్, పాల్గొన్నారు.

నూతన గ్రామపంచాయతీని ఏర్పాటు చేయాలి

నవతెలంగాణ-జన్నారం



మండలంలోని మొర్రిగూడ గ్రామపంచాయతీ పరిధిలోని ఎస్సీ కాలనీ గోండుగూడాలను కలుపుతూ నూతన గ్రామపంచాయతీ ఏర్పాటు చేయాలని గ్రామస్తులు శుక్రవారం ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ ఆ రెండు గూడాలలో దాదాపు 600 జనాభా ఉన్నారని, గ్రామపంచాయతీకి మూడు కిలోమీటర్ల దూరంలో ఉండడం చేత అభివృద్ధి జరగడం లేదన్నారు. అధికారుల దృష్టికి తీసుకువెళ్లి వెంటనే నూతన గ్రామపంచాయతీ ఏర్పాటుకు సహకరించాలని ఎమ్మెల్యేని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రేమ్ సాగర్, గంగారాం, కాంతారావు, భీమన్న, ఇందూర్ పోశం శ్రీనివాస్, భీమన్న, నరసయ్య ప్రశాంత్, రాజన్న, మల్లే శ్రీనివాస్ పాల్గొన్నారు.

డీపీఓ పారిశుధ్య పనుల పరిశీలన



నవతెలంగాణ-జన్నారం

మండలంలోని రేండ్లగూడ, కిష్టాపూర్, మొర్రిగూడ, ఇందనపల్లి గ్రామాలలో జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వరరావు శుక్రవారం విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో పారిశుధ్య పనులు పరిశీలించి తగు సూచనలు చేశారు. రేండ్లగూడలో డంపింగ్ యార్డ్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పంచాయతీ కార్యదర్శులందరూ పారిశుధ్యం విషయంలో అప్రమత్తంగా ఉండాలన్నారు. గ్రామాల్లో చెత్తను ఎప్పటికప్పుడు ఎత్తేస్తూ వాడలను శుభ్రంగా ఉంచాలన్నారు. ఆయన వెంట ఎంపీడీఓ ఠాగూర్ శశికళ, ఎంపీఓ జలంధర్, ఆయా గ్రామ పంచాయతీల కార్యదర్శులు ఎల్. శ్రీనివాస్ నాయక్, చంద్రమౌళి ఉన్నారు.

నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ఎస్సైకి సన్మానం



నవతెలంగాణ-నార్నూర్

గాదిగూడ మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌లో నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ఎస్సై మహేష్‌ను శుక్రవారం హ్యూమన్ రైట్స్ టీమ్ సభ్యులు శాలువాతో సన్మానం చేశారు. గ్రామాల్లో ఉన్న సమస్యలపై వివరించారు. శాంతి పరిరక్షణకు కృషి చేయాలని, చేపట్టే కార్యక్రమాలకు సహాయ సహకారాలు అందించాలని అన్నారు. కార్యక్రమంలో టీమ్ సభ్యులు గేడం శేద్ము, సాక్రే శంకర్, చిత్రం లక్ష్మణ్, కొట్నాక్ కవిత, కొరెంగా శంభు, చిత్రం తిరుపతి ఉన్నారు.

తహసీల్దార్‌గా కొట్నాక్ రఘునాథ్‌రావు బాధ్యతల స్వీకరణ



నవతెలంగాణ-బేల

మండల నూతన తహసీల్దార్‌గా కొట్నాక్ రఘునాథరావు బాధ్యతలు స్వీకరించారు. మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో ఆయన శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయనకు కార్యాలయ సిబ్బంది పుష్పగుచ్ఛం అందజేసి పరిచయం చేసుకుని స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ సిడాం వామన్‌రావు, ఆర్ఐ లు, సిబ్బంది పాల్గొన్నారు.

రేపు గద్దర్ సంస్మరణ సభ



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

తొలి, మలిదశ తెలంగాణ సాధన ఉద్యమాల్లో తన చైతన్య గీతాలతో ప్రజల్లో చైతన్యం నింపిన ప్రజా యుద్ధనౌక గద్దర్ సంస్మరణ సభను ఈ నెల 22న నిర్వహిస్తున్నట్టు సంస్మరణ సభ నిర్వహణ కమిటీ ప్రతినిధి సొగల సుదర్శన్ తెలిపారు. శుక్రవారం పట్టణంలోని టీఎన్‌జీవోస్ భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో భాగంగా కార్యక్రమ వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. స్థానిక ఎస్టీయూ భవన్‌లో నిర్వహించే ఈ వేడుకకు రాష్ట్ర మంత్రి సీతక్క, ఎమ్మెల్సీ కోదండరాం, గద్దర్ కూతురు వెన్నెల, కవులు, కళాకారులు, మేధావులు హాజరవుతారని తెలిపారు. కార్యక్రమానికి గద్దర్ అభిమానులు, ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో టీఎన్జీవోస్ అధ్యక్షులు సంద అశోక్, లక్ష్మారెడ్డి, పరమేశ్వర్, అర్బత్ ఖాన్, ప్రశాంత్ పాల్గొన్నారు.

నేటి బంద్‌ను విజయవంతం చేయాలి

నవతెలంగాణ-ఆదిలాబాద్ రూరల్

ఆదివాసీ మహిళపై జరిగిన లైంగికదాడికి నిరసనగా చేపట్టే బంద్‌ను విజయవంతం చేయాలని చించుఘాట్ గ్రామ పటేల్ కుమ్ర రాజు అన్నారు. శుక్రవారం మండలంలోని చించుఘాట్ ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. నేడు తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఆదివాసీ హక్కుల పోరాట సమితి తుడుం దెబ్బ అనుబంధ సంఘాలు, ఆదివాసీ పటేళ్ల సంఘం, ఆదివాసీ రాయిసెంటర్, కార్మిక, కర్షక విద్యార్థి మహిళ సంఘాల నాయకులు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని ఇంద్రవెల్లి కేస్లాపూర్ డిక్లరేషన్‌ను జైనూరు సంఘటనపై ప్రకటించిన ఉద్యమ కార్యాచరణను ఆదివాసీ పెద్దల సభ తీసుకున్న నిర్ణయాన్ని ఆమోదిస్తూ స్వాగతిస్తూ జైనూరు సంఘటనపై తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా సంపూర్ణ బంధు నిర్వహించే విధంగా, బంద్ సక్సెస్ అయ్యే విధంగా మన ఆదివాసీ ఉద్యమకారులందరూ సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కుమ్ర జంగుబాపు, అశోక్ కుమార్, కిరణ్ పాల్గొన్నారు.

గల్ఫ్ కార్మికుల కోసం జీఓ విడుదలపై హర్షం

- మండల కేంద్రంలో గల్ఫ్ కార్మికుల ర్యాలీ, సీఎం చిత్రపటానికి పాలాభిషేకం



నవతెలంగాణ-జన్నారం

గల్ఫ్ కార్మికుల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం ఒక జీఓ విడుదల చేయడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ మండల కేంద్రంలో శుక్రవారం గల్ఫ్ కార్మికులు ర్యాలీ నిర్వహించారు. అనంతరం సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. గల్ఫ్ మృతుల కుటుంబాలకు రూ.5 లక్షల ఎక్స్ గ్రేషియా 2023 డిసెంబరు 7 తర్వాత మరణించిన గల్ఫ్ కార్మికుల కుటుంబాలకు వర్తింపచేస్తూ గల్ఫ్ కార్మికుల సంక్షేమంపై అధ్యయనం కోసం అడ్వయిజరీ కమిటీ ఏర్పాటు, అంతేకాకుండా ఫిర్యాదుల కోసం ప్రత్యేకంగా ప్రవాసీ ప్రజావాణి ఏర్పాటు, గురుకులాల్లో గల్ఫ్ కార్మికుల పిల్లలకు మొదటి ప్రాధాన్యతనే ఉత్తర్వుల జారీ చేసింది. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి గల్ఫ్ కార్మికులు ధన్యవాదాలు తెలిపారు తెలంగాణ తల్లి విగ్రహం వద్ద అతని చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. జన్నారం మండలంలో విజయోత్సవ ర్యాలీ ధర్మారం రోడ్డు నుండి బస్టాండ్ వరకు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గౌరవ అధ్యక్షులు సేపురి గోపాల్, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ అమరగొండ తిరుపతి, కన్వీనర్ సంద సుదర్శన్, ప్రధానకార్యదర్శి పెరుగు మల్లికార్జున్, ప్రధాన సలహాదారులు మగ్గిడి తిరుపతి, కార్యదర్శులు ఎండీ హస్సన్ పాల్గొన్నారు.

హిందీ భాషా పండితుల కృషి ఎనలేనిది



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

రాష్ట్ర భాష హిందీ సేవలో జిల్లా హిందీ ఉపాధ్యాయులు చేస్తున్న కృషి ఎనలేదని ఎంపీ గోడం నగేష్ అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో హిందీ దినోత్సవ వారోత్సవాల ముగింపు కార్యక్రమం అట్టహాసంగా జరిగింది. దీనికి ఎంపీ, ఎమ్మెల్యే పాయల శంకర్ ముఖ్యాతిథులుగా పాల్గొన్నారు. హిందీలో విశేష సేవలు అందించిన స్వర్గీయ గుజరాతి శివరాం, ఏ.ప్రకాష్‌గౌడ్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళు లర్పించారు. జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ త్వరలోనే హిందీ భవనం కోసం కలెక్టర్‌తో మాట్లాడి కేటాయిస్తామని హామీ ఇచ్చారు. హిందీ భాషా అభివృద్ధి కోసం తమ వంతు కృషి చేస్తామని పేర్కొన్నారు. అనంతరం నూతనంగా పదోన్నతి పొందిన వందమంది హిందీ ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ జీవన్‌రెడ్డి, డీఈఓ ప్రణీత, ప్రముఖ వక్తలు జమీ ప్రసాద్, మధుబావల్కర్, భజరంగ్ లాల్ అగర్వాల్, హిందీ ఉత్సవ సమితి అధ్యక్షులు ప్రమోద్ ఖత్రి, సుహాసినిరెడ్డి, ప్రఫుల్ వర్ఘే, హిందీ భాష సేవా సమితి జిల్లా అధ్యక్షులు సుకుమార్ పెట్కులే, సాహితీ వేత్త ప్రసాద్‌రావు జామి, ప్రధాన కార్యదర్శి దత్తాత్రేయ ద్రోణాలే, కార్యవర్గ సభ్యులు, సాహితీవేత్తలు పాల్గొన్నారు.

లోకేశ్వరం : మండలంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో కళాశాల ప్రిన్సిపాల్ గౌతం అధ్యక్షతన శుక్రవారం హిందీ భాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల అధ్యాపక బృందం హిందీ అధ్యాపకుడు గౌతంను శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా అధ్యాపకులు మాట్లాడుతూ హిందీ భాష నైపుణ్యాన్ని విద్యార్థులకు తెలియజేశారు. అనంతరం గత సంవత్సరంలో హిందీ భాషలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు, హిందీ భాషలో ఉపన్యాసంలో గెలుపొందిన విద్యార్థులకు స్టడీ మెటీరియల్‌ను, బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు వెంకటేశ్వర్లు, విఠల్, వినోద్, ప్రమీల రాణి, శ్రీనివాస్, నవీన్, చిన్నయ్య మహేందర్, సాయినాథ్, హరీష్, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.



లోకేశ్వరంలో..

పట్టభద్రుల అభివృద్ధికి కృషి చేస్తా



నవతెలంగాణ-నిర్మల్

పట్టభద్రుల అభివృద్ధికి కృషి చేస్తానని, వారి సమస్యలకు పరిష్కారానికి తనవంతు పాటుపడుతానని కరీంనగర్-ఆదిలాబాద్-నిజామాబాద్-మెదక్ పట్టభద్రుల నియోజకవర్గ అభ్యర్థి అల్ఫోర్స్ విద్యా సంస్థల చైర్మెన్ వి.నరేందర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ముఖ్యంగా ప్రతి ఒక్క పట్టభద్రుడు ఓటరుగా నమోదు చేసుకొని విలువైన ఓటును వేయాలని సూచించారు. విద్యారంగంలో అపార అనుభవం కలిగిన వాడిగా, విద్యార్థుల సమస్యలు తెలిసిన వాడిగా, సమాజం దశ దిశ మార్చడానికై కృషి చేసి పట్టభద్రుల సంక్షేమానికి చేయూతనిస్తానని అన్నారు. అనంతరం వారు స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల, ప్రభుత్వ జూనియర్ కళాశాల, బార్ అసోసియేషన్, బ్రాహ్మణ సంఘం సందర్శించి వారి అభ్యర్థిత్వాన్ని తెలిపి రాబోయే ఎన్నికలలో తనకే మద్దతివ్వాలని కోరారు. పట్టభద్రులకు ఉద్యోగావకాశాలను కల్పించడానికి కృషి చేస్తానని, ప్రభుత్వ అధ్యాపకుల సమస్యలను పరిష్కరించడానికి తానెప్పుడు ముందుంటానని తెలిపారు. ప్రత్యేకంగా భీమా సౌకర్యం, మౌళిక సదుపాయాల కల్పన, జీతభత్యాలు ఇతర విషయాల్లో ప్రాధాన్యత కల్పించి, పరిష్కరిస్తానని వెల్లడించారు. కార్యక్రమంలో సంబంధిత సంస్థల సిబ్బంది పాల్గొని వారు చేసే కృషిని కొనియాడి ఘనంగా సన్మానించారు.

ప్రయాణికులతో మర్యాదపూర్వకంగా మెలగాలి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ప్రయాణికుల పట్ల డ్రైవర్లు, కండక్టర్లు మర్యాదపూర్వకంగా మెలుగుతూ వారిని సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చాలని, ఆర్టీసీ ఆర్ఎం సోలోమాన్ సూచించారు. పట్టణంలోని ప్రయాణ ప్రాంగణంలో శుక్రవారం ఆర్టీసీ డే సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆర్టీసీ బస్సుల్లో రెగ్యులర్‌గా ప్రయాణం చేస్తున్న ముగ్గురు ప్రయాణికులను శాలువాలతో సత్కరించి అభినందించారు. అనంతరం ప్రయాణికులకు పువ్వులు, కీచైన్ లను అందచేశారు. ఈ సందర్భంగా ఆర్ఎం సోలోమాన్ మాట్లాడుతూ ప్రయాణికుల సౌకర్యార్థం ఆర్టీసీలో అత్యంత నాణ్యమైన సేవలు అందిస్తున్నట్టు తెలిపారు. ప్రయాణికుల పట్ల మర్యాదపూర్వకంగా మెలుగుతూ వారికి ఇబ్బంది కలగకుండా చూడాలని సూచించారు. ఆర్టీసీ ద్వారా అందిస్తున్న సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో డిప్యూటీ ఆర్ఎం ప్రవీణ్, డీఎం కల్పన, నిజామాబాద్ డీఎం శ్రీకర్, శ్రీనివాస్, కార్గో మేనేజర్ ప్రవీణ్ కుమార్ పాల్గొన్నారు.



ప్రభుత్వ పాఠశాలలో స్వచ్ఛదనం-పచ్చదనం

లోకేశ్వరం : మండలంలోని రాజుర జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలలో శుక్రవారం స్వచ్ఛదనం పచ్చదనం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణంలో ఉన్న పిచ్చి మొక్కలను తొలగించారు. అనంతరం పాఠశాల ఆవరణంలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ వెంకట రమేష్, ఎంపీఓ సోలమన్‌రాజ్, పంచాయతీ కార్యదర్శి మహేష్, ఇన్‌చార్జ్ ప్రధానోపాధ్యాయులు అర్చన, ఉపాధ్యాయులు, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఇంటికి చేరుకున్న తప్పిపోయిన గల్ఫ్ కార్మికుడు

నవతెలంగాణ-నిర్మల్

నిర్మల్ జిల్లా దిలావర్‌పూర్ మండల కేంద్రానికి చెందిన సప్పాల గంగాధర్ పని నిమిత్తం దుబాయ్ వెళ్లాడు. గత వారం రోజులుగా అతను కనబడకపోవడంతో కుంటాల శివరాజ్, రవి కంబ కుమార్ జీడబ్ల్యూఏసీ అబుధాబి ప్రెసిడెంట్ గడ్పంద నరేందర్ తెలిపారు. వెంటనే స్పందించిన ఆయన గల్ఫ్ కార్మికుల అవగాహన వేదిక గ్రూప్ సభ్యుల సహకారంతో రషిదియా హాస్పటిల్‌లో ఉన్నాడని తెలుసుకొని సెక్యూరిటీ సహకారంతో అతనితో మాట్లాడారు. దుబాయ్‌లోని కంపెని వారు స్పందించకపోవడంతో దిలావర్‌పూర్ గ్రామానికి చెందిన మార్గం శ్రీకాంత్‌ను ఆస్పత్రికి పంపించి గంగాధర్‌తో మాట్లాడించారు. ఇంటి దగ్గర నుండి వాళ్ల అన్నా సహకారంతో టికెట్ తీసుకొని విమానాశ్రయం నుంచి హైదరాబాద్ పంపించారు. గల్ఫ్ బాధితుడు గంగాధర్ శుక్రవారం ఇంటికి క్షేమంగా చేరుకున్నాడు. ఇందుకు సహకరించిన కృష్ణ దోనికేనీ, రవి కటుకం, కిరణ్ కుమార్ మహరాజ్, పెద్ది రవి కుమార్, సంధర్పల్లి నర్సయ్య, సాయికృష్ణ, చిలివేరి నవీన్, వెంకటేశ్, ప్రవీణ్, విమానాశ్రయం వరకు తీసుకెళ్లి బోడింగ్ చేయించిన మార్గం శ్రీకాంత్‌లకు కుటుంబీకులు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

పీఆర్టీయూటీఎస్ నూతన కార్యవర్గం ఎన్నిక



నవతెలంగాణ-బజార్‌హత్నూర్

మండల కేంద్రంలో పీఆర్టీయూటీఎస్ నూతన కార్యవర్గాన్ని శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కె.చంద్రకాంత్ బాబు, ప్రధాన కార్యదర్శిగా విద్యాసాగర్, అసోసియేట్ అధ్యక్షుడు బి.లక్ష్మణ్, మహిళా ఉపాధ్యక్షులు అనిత, కార్యదర్శి విజయ్, శేఖర్‌ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా చంద్రకాంత్‌బాబు మాట్లాడుతూ టీచర్ల సమస్యల పరిష్కారానికి ఎల్లవేళలా కృషి చేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి రవీందర్‌రెడ్డి, మాజీ జిల్లా అధ్యక్షుడు సత్యనారాయణగౌడ్, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు ఆర్టీవీ ప్రసాద్, రాష్ట్ర కార్యదర్శి సదానందం, జిల్లా ఉపాధ్యక్షులు సంతోష్, సూర్యకాంత్ పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాలను పరిశీలించిన ప్రిన్సిపాల్



నవతెలంగాణ-ముధోల్

మండల కేంద్రంలోని ప్రభుత్వ డీగ్రీ కళాశాలను ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ కర్రోళ్ల బుచ్చయ్య శుక్రవారం పరిశీలించారు. నూతనంగా డీగ్రీ కళాశాల మంజూరు కావటంతో కళాశాల ప్రారంభానికి జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు భవనాన్ని ఆధీనంలో తీసుకున్నారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడారు. కళాశాల ప్రారంభానికి సంబంధించి తదుపరి చర్యలకు ఉపక్రమిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, డా.భీమ్‌రావ్, గుంత సుధాకర్, డా. ఓంప్రకాష్, టీడీసీ అధ్యక్షుడు గుంజల నారాయణ, నాయకులు రోళ్ల రమేష్, పతంగి కిషన్, సంజీవ్, గంగాధర్, శంకర్, అశోక్ పాల్గొన్నారు.

మాల సంక్షేమ సంఘం పట్టణ కార్యవర్గం ఏకగ్రీవం

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

మాల సంక్షేమ సంఘం పట్టణ నూతన కార్యవర్గాన్ని శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పట్టణంలోని పీఆర్టీయూ భవన్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎన్నికల అధికారి సుభాష్ నేతృత్వంలో నూతన కమిటిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సంఘం పట్టణ గౌరవాధ్యక్షుడిగా ప్రభుదాస్, అధ్యక్షుడిగా దువాస దేవేందర్, ప్రధాన కార్యదర్శిగా ప్రదీప్ కుమార్, కోశాధికారిగా నల్ల రవీందర్‌తో పాటు పలువురు సభ్యులను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన కమిటి సభ్యులను శాలువాలతో సత్కరించి అభినందనలు తెలియచేశారు. తనపై నమ్మకంతో బాధ్యతలు ఇచ్చిన సభ్యులకు నూతన అధ్యక్షులు దేవేందర్ ధన్యవాదాలు తెలియజేశారు. సంఘం అభివృద్ధికి తమ వంతుగా కృషి చేస్తామని పేర్కొన్నారు.

ఎస్సైగా శంకర్ బాధ్యతల స్వీకరణ

నవతెలంగాణ-దస్తురాబాద్

నూతన ఎస్సైగా శుక్రవారం ఆర్.శంకర్ బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఎస్సైగా విధులు నిర్వర్తించిన రాహుల్ గైక్వాడ్ ఖానాపూర్‌కు బదిలీ అయ్యాడు. పెంబి మండలానికి చెందిన ఆర్.శంకర్ ఎస్ఐగా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మండలంలో శాంతిభద్రతలు కాపాడడానికి కృషి చేస్తానని తెలిపారు. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా మండల ప్రజలు సహకరించాలని కోరారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

నవతెలంగాణ-కాసిపేట

మండలంలో శనివారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు విద్యుత్ శాఖ ఏఈ స్వర్ణలత తెలిపారు. 33/11 కేవీ కొండాపూర్ సబ్ స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా శనివారం మండలంలో ఉదయం 10:30 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని, విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

గుడుంబా స్థావరాలపై పోలీసుల దాడులు

నవతెలంగాణ-కడెం

ఎస్సై కృష్ణసాగర్‌రెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం మాసాయిపేట్‌లో గుడుంబా స్థావరాలపై దాడులు నిర్వహించారు. ఓ వ్యక్తి ఇంటి వద్ద గుడుంబా తయారీకి సిద్ధం చేసిన 500 లీటర్ల బెల్లం పానకం ధ్వంసం చేశారు. చట్ట వ్యతిరేకంగా గుడుంబా తయారు చేస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ హెచ్చరించారు.